దాహం..దాహం..

వేసవి ఆరంభం నుంచే ఎండలు మండుతున్నాయి. ఎన్నడూ లేని విధంగా మార్చి నుంచే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ ప్రభావంతో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. జిల్లాలో ఎక్కడ చూసినా తాగునీటి ఎద్దడితో దాహం కేకలు వినిపిస్తున్నాయి. వేసవి ప్రారంభంలోనే తాగునీటి కష్టాలతో కర్నూలు నగర వాసులు ఆందోళన చెందుతున్నారు...

- అడుగంటిన భూగర్భ జలాలు - కర్నూలు నగరంలో నీటి ఎద్దడి

పెద్దపాడులో ట్యాంకర్ వద్ద నీటి కోసం ఎదురుచూస్తున్న స్థానికులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మండే ఎండలతో గొంతులు తడారిపోతున్నాయి. భానుడి తాపానికి చెరువులు, బావులు ఇంకిపోతున్నాయి. వేసవి వచ్చిందంటే కర్నూలు ప్రజలు తాగునీటి కోసం నానా తంటాలు పడాల్సి వస్తోంది. పక్కనే తుంగభద్ర, హంద్రీ జలాలు ఉన్నా ఏటా దాహం కేకలు తప్పటం లేదు. కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలో 52 వార్డులు ఉన్నాయి. గతంతో పోలిస్తే నగర విస్తీర్ణం పెరిగింది అందుకు అనుగుణంగా జనాభా పెరిగిపోయింది. దీంతో మనిషి యొక్క అవసరాలకు తగినంత నీరు అందించలేని పరిస్థితి నెలకొంది. 2005లో అప్పటి ఎమ్మెల్యే నగర ప్రజలకు కావలసిన నీరు అందించేందుకు 200 ఎకరాల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ రూ.220 కోట్లతో నిర్మాణం చేపట్టి అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి చేతులమీదుగా ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్ ప్రారంభించారు. అదే సందర్భంగా 12 ఓవర్ హెడ్ ట్యాంకులను కూడా నిర్మాణం చేపట్టారు. అప్పటికి తాగునీటి సమస్య తీరింది కానీ నాటినుండి నేటి వరకు ఉన్న పాలకుల దూర దృష్టి లేకపోవడంతో నగర జనాభాకు అనుగుణంగా తాగునీటి అవసరాలను తీర్చేందుకు కావలసిన ప్రణాళికలు చేపట్టకపోవడంతో కర్నూలు నగర ప్రజలకు త్రాగునీరు అందించడంలో ఘోరంగా వైఫల్యం పొందారు. కర్నూలు జనాభాకు ప్రతిరోజు 120 ఎంఎల్‌డి నీరు అవసరం కాగా ప్రస్తుతం 85 ఎంఎల్‌డి నీరు అందిస్తున్నారు. నగరానికి తాగునీటి అవసరాలు తీర్చే సుంకేసుల జలాశయం నుండి నీరు సరఫరా చేసే పరిస్థితి ఉండేది. అక్కడ కూడా నీరు అడగండిపోవడంతో గాజులదిన్నె ప్రాజెక్టు నుండి నీటిని తెచ్చుకొని వాడుకునే పరిస్థితి నెలకొంది. నగరంలోని 52 వార్డుల్లోనూ నీటి ఎద్దడి ఉండగా లక్ష్మీపురం, పెద్దపాడు, పందిపాడులో నీటి సమస్య తీవ్రంగా ఉంది. నగర పాలక సంస్థ సరఫరా చేసే ట్యాంకర్ల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ట్యాంకర్లు వచ్చినప్పుడు వంతుల కోసం వేచి చూడాల్సి వస్తోంది. నీటి యుద్ధాలు కూడా తప్పడం లేదు. మూడురోజులకోసారి ట్యాంకర్ వస్తుండటంతో పట్టుకున్న నీరు మూడు రోజులకు సరిపోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో నీరు తక్కువగా ఉండటంతో ఏప్రిల్ 1 నుండి రోజు విడిచి రోజు తాగునీరు విడుదల చేస్తున్నట్లు కమిషనర్ భార్గవ్ తేజ ప్రకటించారు. సుంకేసుల జలాశయంలో పూర్తిగా నీరు అడగండిపోవడంతో గాజులదిన్నెలో 0.90 టీఎంసీల నీరు నిలువ చేయాలని సోమవారం కమిషనర్ ఏ భార్గవ్ తేజ ఇరిగేషన్ ఎస్ఈకి లేఖ రాశారు. ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రతిరోజు గాజులదిన్నె నుంచి 58 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని లేఖలో కోరారు.

రెండో ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలి

కర్నూలు నగర ప్రజల అవసరాలకు అనుగుణంగా రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలి. ఎం.ఎ గఫూర్ సిపిఎం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 2005లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టి కర్నూలు ప్రజలకు తాగునీటి అవసరాలను తీర్చారు. వర్షాభావ పరిస్థితులతో వేసవిలో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడింది. భూగర్భ జలాలు ఎండిపోయాయి. కర్నూలు నగరానికి సుంకేసుల రిజర్వాయర్ ద్వారా నీటి సరఫరా అయ్యేది. అందులో కూడా నీరు అడగంటిపోవడంతో, గాజులదిన్నె ప్రాజెక్టు నుండి నీరు తెప్పించేందుకు అధికారులు కృషి చేస్తున్నట్లు తెలిసింది. పాలకులు అధికారుల ముందు చూపు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి అని ప్రజలు అనుకుంటున్నారు. వర్షాలు పడకపోతే ఏప్రిల్, మే నెలలలో నీటి కోసం యుద్ధాలు జరిగే రోజులు వస్తాయి.

- ఎం రాజశేఖర్, సిపిఎం ఓల్డ్ సిటీ నగర కార్యదర్శి.

రెండు రోజులకోసారి..

2000 సంవత్సరంలో కల్లూరు కర్నూలు నగర పాల సంస్థలో విలీలమైనప్పటికీ ఇప్పటికీ రోజు విడిచి రోజు నీరు వస్తుంది. పాలకులు, అధికారులు తమ స్వార్థ ప్రయోజనాలు తప్ప ప్రజల ప్రయోజనాలు పట్టించుకోవడంలేదు. ప్రజా సమస్యలను పట్టించుకునే నాయకులను రానున్న ఎన్నికల్లో గెలిపించుకోవాలి. నగరంలో ఉన్న బోర్లు అన్ని రిపేరు చేయించి అక్కడే జిఎల్ఎస్ఆర్ ట్యాంకులను ఏర్పాటు చేయాలి.

- వి.వాణి, ముజఫర్ నగర్.

ఎన్నికల్లో 85 శాతం పోలింగ్ జరగాలి : కలెక్టర్

ప్రజాశక్తి-ఆలూరు

ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటుహక్కును ఓటరు వినియోగించుకునేటట్లు అవగాహన కల్పించి, 85 శాతం పోలింగ్ జరిగేటట్లు చూడాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన నియోజకవర్గ ఎన్నికల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆలూరులోని ఆర్‌డిటి ఆడిటరియంలో రిటర్నింగ్ అధికారి రాము నాయక్ ఆధ్వర్యంలో ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఈ ఎన్నికలను రాజ్యాంగబద్ధంగా, హక్కుగా ప్రతి ఓటరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేటట్లు ప్రతి అధికారీ బాధ్యతను నిర్వహించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరూ నడుచుకొన్నా చర్యలుంటాయని హెచ్చరించారు. ఏ అధికారికి, ఏయే బాధ్యతలు అప్పగించారో వారు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. సి-విజిల్ యాప్‌లో ఎవరు ఫిర్యాదు చేసినా, వారి పేర్లను గోప్యంగా ఉంచి ఆ ఫిర్యాదుపై విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. శిక్షణలో అధికారులకు అర్థం కాకపోతే ఉన్న సమయంలో ఎన్నిసార్లు అయినా తెలుసుకోవాలని కోరారు. అంతకుముందు జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. **పత్తికొండ**లోని గోపాల్ ప్లాజాలో సాధారణ ఎన్నికల నిర్వహణపై ఆలూరు, పత్తికొండ నియోజకవర్గ స్థాయి సెక్టోరల్ అధికారులు, బూత్ లెవెల్ స్థాయి అధికారులు, ఎంసిసి బృందాలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఓటర్ల జాబితాలో ఉండాల్సిన ఓటరు లేకున్నా, ఉండకూడని వ్యక్తి ఉన్నా, బాధ్యత వహించేది బిఎల్ఓలేనని తెలిపారు. ఎవరైనా సిబ్బంది పోలింగ్ కేంద్రంలో కనీస సదుపాయాలు లేకుండా ఇబ్బంది పడినట్లు తన దృష్టికి వస్తే బూత్ లెవెల్ స్థాయి అధికారులు, సెక్టోరల్ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రోడ్డు మార్గం బాగుందా లేదో చెక్ చేసుకోవాలని, మైనర్ రిపేర్లు ఉంటే చెప్పాలని గతంలో సెక్టోరల్ అధికారులందరికీ సూచించినట్లు తెలిపారు. సెక్టోరల్ అధికారులకు మేజిస్ట్రేట్ పవర్స్ కూడా ఇచ్చినట్లు చెప్పారు. ఎక్కడైనా అనుకోని పరిస్థితుల్లో లా అండ్ ఆర్డర్ సమస్య వస్తే మేజిస్ట్రేట్ పవర్స్ ఉపయోగించవచ్చని తెలిపారు. పత్తికొండ రిటర్నింగ్ అధికారి రామలక్ష్మి, పత్తికొండ తహశీల్దార్ మాధవరావు పాల్గొన్నారు.

ఆలూరులో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

పత్తికొండలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

జెసికి వినతిపత్రం అందజేస్తున్న రామకృష్ణ, నాయకులు

పోలీసుల దౌర్జన్యాల నుంచి

రైతులను కాపాడాలి

- ఉల్లిందకొండ ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి
- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కల్లూరు మండలం ఎర్రకత్వ, కొల్లంపల్లి తండా గ్రామాల గ్రీన్‌కో కంపెనీ, పోలీసుల దౌర్జన్యాల నుంచి రైతులను కాపాడాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో ఆయా గ్రామాల రైతులతో కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం జెసి నారపురెడ్డి మౌర్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుల పొలాల్లో గ్రీన్‌కో కంపెనీకి చెందిన విద్యుత్ టవర్లు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. రైతుల అనుమతి లేకుండా, అరకొర నష్టపరిహారం ఇచ్చి దౌర్జన్యంగా రైతుల పొలాల్లో స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. పోలీసులను పెట్టి దౌర్జన్యంగా పనులు జరిపిస్తున్నారన్నారు. ఉలిందకొండ ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించకపోతే రైతులను సమీకరించి పనులను నిలిపివేస్తామని హెచ్చరించారు. రైతుల పొలాల్లో విద్యుత్తు స్తంభాలు వేయడం వల్ల భూముల విలువ శాశ్వతంగా కోల్పోతున్నారని తెలిపారు. భూములు చాలా విలువైనవని, ఇక్కడే చెరువు ఉండడం వల్ల బోర్లు వేస్తే దాదాపు అన్ని పొలాల్లో నీరు సమృద్ధిగా పడ్డాయని చెప్పారు. ఒక పంటైనా గ్యారెంటీగా పండే పరిస్థితి ఉందని తెలిపారు. భూముల విలువ కూడా బాగా పెరిగిందని, అందరూ సన్న, చిన్నకారు రైతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులు ఉన్నారని చెప్పారు. రూ.లక్షలు వస్తాయని రైతులను నమ్మించి సంతకాలు చేయించుకొని, అదే రైతు కన్సల్ట్ అని చెబుతూ బలవంతంగా భూముల్లో విద్యుత్తు టవర్లు వేస్తున్నారని తెలిపారు. రైతులకు బాసటగా నిలవాల్సిన పోలీసులు గ్రీన్‌కో కంపెనీ వైపు నిలబడి రైతులను బెదిరించి విద్యుత్తు టవర్లు వేయించడం శోచనీయమని విమర్శించారు. కలెక్టర్, ఎస్పీ జోక్యం చేసుకోవాలని, రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జెసి మాట్లాడారు. రైతులపై దౌర్జన్యం చేస్తున్న కంపెనీపై, ఉల్లిందకొండ ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని డీఎస్పీకి రెఫర్ చేసినట్లు తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి కె.మధు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, శివశంకర్, రైతులు గోవిందు, సూర రంగడు, సోమ్లా నాయక్, లక్ష్మీ బాయి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారు

- కర్నూలు ఎంపీ, మూడు అసెంబ్లీ అభ్యర్థుల ప్రకటన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

త్వరలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తున్న అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. మంగళవారం ఇడుపులపాయలో ఎపిసిసి వైఎస్.షర్మిల అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. కర్నూలు ఎంపీ స్థానానికి, నంద్యాల, నందికొట్కూరు, కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థుల పేర్లు ఖరారు చేశారు. కర్నూలు ఎంపీ స్థానానికి బివి.రాంపుల్లయ్య యాదవ్, నంద్యాల అసెంబ్లీ స్థానానికి గోపవరం గోకుల్ కృష్ణారెడ్డి, నందికొట్కూరు అసెంబ్లీ స్థానానికి తోగురు అర్థర్, కోడుమూరు అసెంబ్లీ స్థానానికి పరిగెల మురళీ కృష్ణ పేర్లను ప్రకటించారు. గోకుల్ కృష్ణారెడ్డి నంద్యాల జడ్‌పిటిసి సభ్యునిగా ఉన్నారు. ఇటీవల వైసిపి నుంచి కాంగ్రెస్‌లో చేరారు. తోగురు ఆర్థర్ నందికొట్కూరు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇటీవల వైసిపి నుంచి కాంగ్రెస్‌లోకి చేరారు. పరిగెల మురళీ కృష్ణ మాజీ ఎమ్మెల్యేగా పని చేశారు. ఇటీవల వైసిపిని వీడి కాంగ్రెస్‌లోకి చేరారు.

కాంగ్రెస్ ఖాతాలో నంద్యాల : గోకుల్ కృష్ణా రెడ్డి

నంద్యాల అసెంబ్లీ కాంగ్రెస్ ఖాతాలో చేరబోతున్నట్లు కాంగ్రెస్ అభ్యర్థి గోపవరం గోకుల కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం నంద్యాలలోని ఆయన నివాసంలో మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్టానం నంద్యాల అసెంబ్లీ స్థానానికి తన పేరు ఖరారు చేయడం వైఎస్ షర్మిలకు, కాంగ్రెస్ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో నంద్యాల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కైవసం కానుందని, తనకు అశేష ప్రజాబలం తోడుందని, తన గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు.

షర్మిలమ్మకు గిఫ్ట్ ఇస్తా : తోగురు అర్థర్

నందికొట్కూరు అసెంబ్లీ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుని పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలమ్మకు గిఫ్ట్‌గా ఇస్తామని కాంగ్రెస్ అభ్యర్థి తోగురు అర్థర్ అన్నారు. అసెంబ్లీకి తన పేరు ఖరారు చేసినందుకు అర్థర్ వైఎస్ షర్మిలకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్ఆర్ ఆశయాలను ముందుకు తీసుకుపోయేది షర్మిలమ్మనేనని, రాజన్న పాలన కోసం ప్రతి కాంగ్రెస్ వాది కష్టపడాలని నాయకులకు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు.

ప్రచారం నిర్వహిస్తున్న కాటసాని

35వ వార్డులో కాటసాని ప్రచారం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కల్లూరు అర్బన్ 35వ వార్డు సుంకులమ్మ గుడి ప్రాంతంలో కాటసాని రాంభూపాల్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మంగళవారం వార్డు నాయకులు సాపూరి వీరయ్య ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాటసాని రాంభూపాల్ రెడ్డిని పాణ్యం ఎమ్మెల్యేగా మరోసారి గెలిపించుకుందామని 35వ వార్డు కార్పొరేటర్ ఎస్.మాధురి కోరారు. నాయకులు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, వేయించి జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని గెలిపించుకుందామని కోరారు. వార్డు కార్పొరేటర్లు గాజుల శ్వేతా రెడ్డి, మైతాపు చిన్న నరసింహులు పాల్గొన్నారు.

29వ వార్డులో : కల్లూరు అర్బన్ 29వ వార్డు రామచంద్ర నగర్, రామకృష్ణ నగర్, శారద నగర్‌లో వార్డు కార్పొరేటర్ సంగాల సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాటసాని మాధవి లతారెడ్డి పాల్గొని ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్పొరేటర్ దండు లక్ష్మి కాంతారెడ్డి, నాయకులు వై.శివారెడ్డి, పిడి బాష, హుసేనాలం, రత్నం, రాజేష్, భూపాల్ రెడ్డి, ధనుంజయ ఆచారి పాల్గొన్నారు.

గూడూరులో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి - గూడూరు

గూడూరు నగర పంచాయతీలోని కొత్తగేరిలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కె.రామాంజనేయులు, బోజుగు సృజన్ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' చేపట్టారు. టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి వార్డు ప్రజలకు వివరించారు. 1వ వార్డు కౌన్సిలర్ మల్లాపు బుడ్డంగలి, కౌన్సిలర్ కోడుమూరు షాషావలి, మాజీ కౌన్సిలర్ పి.మధువర్ధన్, టిడిపి నాయకులు బోజుగు పౌలు, తెలుగు శీను, కె.విజయ్ కుమార్, కె.వీరకుమార్, గౌవుండా కుమార్, చిరంజీవి, హరినాథ్, పోతన్న, కోటకొండ లక్ష్మీస్వామి, ప్రతాప్, కర్ణ, శివ, అంజి పాల్గొన్నారు.

పథకాలను వివరిస్తున్న నాయకులు

ఇంటి వద్దనే పింఛను పంపిణీ చేయాలి

- టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఇంటి వద్దనే లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం జెసి నారపురెడ్డి మౌర్యను టిడిపి ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా సచివాలయ సిబ్బంది నేరుగా ఇంటి వద్దకే వెళ్లి పింఛను పంపిణీ చేయాలని కోరారు. లబ్ధిదారులకు ఇవ్వాల్సిన మొత్తాన్ని జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లుల రూపంలో చెల్లించిందన్నారు. వైసిపి ప్రభుత్వం టిడిపిపై అసత్య ప్రచారం చేస్తోందని పేర్కొన్నారు. టిడిపి నాయకులు నాగేంద్ర కుమార్, రవికుమార్, చిన్న మారెప్ప, పరమేష్, షేక్షావలీ, హనుమంతరావు చౌదరి పాల్గొన్నారు. **కర్నూలు (క్రైమ్)** ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒను కలిసి వినతి పత్రం అందజేశారు. టిడిపి కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి మాట్లాడారు. జనసేన నాయకులు ఆకెపోగు రాంబాబు, బుర్ర వెంకటేష్ నాయుడు, సర్పంచుల సంఘం అధ్యక్షులు ఆకెపోగు జయన్న, తెలుగు యువత ఉపాధ్యక్షులు రాజు, బెళగల్ మాజీ జడ్‌పిటిసి చంద్రశేఖర్, పడిదెంపాడు సర్పంచి శంకర్ నాయుడు, ఎంపిటిసి మద్దిలేటి, ఈ.తాండ్రపాడు ఎంపిటిసి వెంకటేష్, కొంతలపాడు రామాంజనేయులు, మహిళా నాయకులు పద్మ, బేగం, మైనార్టీ మండల అధ్యక్షులు పూడూర్ బాష, ఉల్చాల బషీర్, అసదుల్లా, అంబేద్కర్ నగర్ నాగరాజ్, గార్గేయపురం కౌశిక్ రెడ్డి, రామకృష్ణ, భాస్కర్, బలరాం, బడుషా గౌడ్, ప్రకాష్ పాల్గొన్నారు.

తుగ్గలి : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయకుండా సచివాలయాల ఉద్యోగుల ద్వారానే ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయాలని టిడిపి నాయకులు కోరారు. మంగళవారము తుగ్గలి ఎంపిడిఒ కార్యాలయం ఎదుట టిడిపి మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జడ్‌పి మాజీ ఛైర్మన్ బత్తిన వెంకటరాముడు, టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటపతి మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కలెక్టర్ స్పందించి సచివాలయాల ఉద్యోగుల ద్వారా ఇంటింటికీ వెళ్లి పింఛను పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వాలంటీర్లకు అందజేసిన సెల్ ఫోన్, ట్యాబ్‌లు ఇతర సామగ్రిని వెంటనే స్వాధీనం చేసుకోవాలన్నారు. వాలంటీర్లకు పింఛను పంపిణీ చేస్తే సంబంధిత అధికారులపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. టిడిపి నాయకులు తిమ్మప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు. **వెల్దుర్తి** ఎంపిడిఒ కార్యాలయ సిబ్బందికి, వెల్దుర్తి మేజర్ పంచాయతీ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. టిడిపి మండల అధ్యక్షులు బలరాం గౌడ్, వీరభద్రుడు, మెకానిక్ నారాయణ, రాఘవేంద్ర గౌడ్, బజారు, రామచంద్ర నాయుడు పాల్గొన్నారు. **కర్నూలు (హాస్పిటల్)**లో టిడిపి పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరితమ్మ సూచనల మేరకు టిడిపి కల్లూరు మండల కమిటీ ఆధ్వర్యంలో కల్లూరు ఎంపిడిఒ కార్యాలయంలో ఇఒఆర్‌డి రవికిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. టిడిపి మండల అధ్యక్షులు డి.రామాంజనేయులు, నాయకులు మాదేష్, వి.రమణ, పవన్, మస్తాన్, విజయ్ కుమార్, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, విజయ్, డి.శేఖర్, పి.పరమేష్ పాల్గొన్నారు.

జెసికి వినతి పత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

ఇఒఆర్‌డి రవి కిషోర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

బాబుకు ఓటుతో బుద్ధి చెప్పండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వెల్దుర్తి

ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీదేవి

దళితులంటే, బీసీలంటే హేళన చేస్తున్న చంద్రబాబుకు ఎన్నికల్లో తగిన బుద్ధిచెప్పాలని ఎమ్మెల్యే శ్రీదేవి కోరారు. మంగళవారం మండలంలోని సర్పరాజపురం, నర్సాపురం, ఎస్.బోయినపల్లి గ్రామాల్లో ఇంటింటికీ ప్రచారం చేపట్టారు. ముందుగా ఆయా గ్రామాల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పేదల గడపగడపకు అందుతున్న సంక్షేమ పథకాలు, గ్రామగ్రామాన అభివృద్ధి కొనసాగాలంటే, సౌకర్యాల కల్పన మెరుగు పడాలంటే మే 13న జరగనున్న ఎన్నికల్లో వైసిపికి ఓటు వేయాలని కోరారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బివై.రామయ్యను గెలిపించాలని కోరారు. బోయినపల్లి గ్రామస్తులు ప్రతి ఇంటి దగ్గర గుమ్మడికాయతో హారతులు ఇచ్చారు. ఎమ్మెల్యేకు బోయినపల్లి సర్పంచి నర్సింగ్ శివ జ్యోతి గజమాలతో స్వాగతం పలికారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తానని హామీఇచ్చారు. వైసిపి నాయకులు రామ్మోహన్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ రవి రెడ్డి, బోయినపల్లి అశోక్ కుమార్ రెడ్డి, కొత్తూరు వెంకటేశ్వర రెడ్డి, నరసాపురం కృష్ణారెడ్డి, వైసిపి పట్టణ కన్వీనర్ వెంకట్ నాయుడు పాల్గొన్నారు.

పర్లలో గడ్డివాములు దగ్ధం

- రూ.3 లక్షల ఆస్తి నష్టం

- బాధితులకు గౌరు వెంకటరెడ్డి ఆర్థిక చేయూత

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం పర్ల గ్రామంలో నలుగురు రైతులకు చెందిన గడ్డివాములు ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి వేశారు. ఈ సంఘటనలో సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు కురువ అయ్యన్న, కురువ సోమన్న, మంగళి నాగ సుంకన్న, అశోక్ కుమార్ రెడ్డి వాపోయారు. టిడిపి సీనియర్ నాయకులు, నందికొట్కూరు ఇన్‌ఛార్జీ గౌరు వెంకటరెడ్డి పర్ల గ్రామానికి వెళ్లి సంఘటన స్థలాన్ని సందర్శించి బాధిత రైతులను పరామర్శించి ఓదార్చారు. ఒక్కో రైతుకు రూ.5 వేల ఆర్థిక చేయూతను అందించారు. టిడిపి మండల అధ్యక్షులు డి.రామాంజనేయులు, బీసీ సాధికార కమిటీ అధ్యక్షులు కె.మహానంది, నాయకులు మాదేష్, కె.శేఖర్, ఉప్పర రామగిడ్డయ్య, రవి, లక్ష్మన్న పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న గౌరు వెంకటరెడ్డి

వైసిపిలోకి ఉలిందకొండ యువకులు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలోని యువకులు టిడిపిని వీడి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సమక్షంలో వైసిపి ఉలిందకొండ నాయకులు కెవి.రమణారెడ్డి, ఎవి.రమణ ఆధ్వర్యంలో వైసిపిలో చేరారు. ఎమ్మెల్యే కాటసాని ఒక్కొక్కరికి వైసిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అందరం కలిసి కట్టుగా పనిచేసి జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని కోరారు. ఫిరోజ్, శ్రీను, హరి, వేణు, అల్తాఫ్, సత్యం, వెంకటేశ్వర్లు, అనిల్, మంగలి రంగస్వామి, రాజు, పింజరి సాయి, బోయ రవి ఉన్నారు.

మాట్లాడుతున్న గౌరవ సలహాదారులు ఈశ్వరయ్య

నైపుణ్యంతో కూడిన విద్యపై దృష్టి

- రిటైర్డ్ ప్రిన్సిపల్ చెన్నయ్య

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నైపుణ్యంతో కూడిన విద్యపై దృష్టి పెడితే భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చని రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.చెన్నయ్య తెలిపారు. మంగళవారం నగరంలోని బిర్లా కాంపౌండ్ సమీపంలో ఉన్న ప్రీమియర్ జూనియర్ కళాశాల పరిధిలో శ్రీఈశ్వరస్ ట్యుటోరియల్ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్, ఎపిఆర్‌జెసి శిక్షణ శిబిరాన్ని డాక్టర్ కె.చెన్నయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు అన్ని విషయాలపైనా అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం ట్యుటోరియల్ గౌరవాధ్యక్షులు డి.ఈశ్వరయ్య మాట్లాడారు. ప్రతేడాది ఈ ట్యుటోరియల్ ద్వారా అనేక మందికి శిక్షణ పొంది పాలిటెక్నిక్, ఎపిఆర్‌జెసిలో ప్రవేశాలు పొందుతున్నారని తెలిపారు. రాష్ట్రస్థాయిలోనే ఉత్తమ ర్యాంకులను కూడా సాధించినట్లు చెప్పారు. ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

పాదయాత్రికులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లే కర్ణాటక భక్తులకు వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో మంగళవారం సుందరయ్య సర్కిల్‌లో పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసవి మహిళా మండలి అధ్యక్షులు ఇల్లూరు రాజ్యలక్ష్మి మాట్లాడారు. ప్రతేడాది ఈ విధంగా భక్తులకు రూ.30 వేల విలువ చేసే పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మండలి కార్యదర్శి బైసాని పద్మజ, ట్రెజరర్ టిజి.ఉమాదేవి సహకారం అందించారు.

పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

'హోం ఓటింగ్'ను సద్వినియోగం చేసుకోవాలి

- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి - ఆదోని

వృద్ధులు, వికలాంగులకు భారత ఎన్నికల సంఘం కల్పించిన 'హోం ఓటింగ్'ను సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ ఆదేశించారు. మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణంలో బిఎల్ఒలకు, సెక్టోరల్, రూట్ ఆఫీసర్లకు హోం ఓటింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారత ఎన్నికల సంఘం అధిక వైకల్యం ఉన్న వారికి, 85 ఏళ్ళు, ఆపై వయస్సున్న వృద్ధులు ఇంటి దగ్గర నుంచే ఓటు వేసే హోం ఓటింగ్ సౌకర్యాన్ని అందుబాటులో తెచ్చిందని తెలిపారు. హోం ఓటింగ్ కోసం ఫారం 12డి సహాయంతో బిఎల్ మార్కింగ్ చేయించుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో హోం ఓటింగ్ విధానాన్ని పూర్తి స్థాయిలో పటిష్టంగా అమలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. పోలింగ్, భద్రత సిబ్బంది ఉన్న ప్రత్యేక బృందం హోం ఓటింగ్‌లో భాగస్వామ్యమవుతుందని, వీడియోగ్రఫీ కూడా చేస్తామని వివరించారు. పరిపాలన అధికారి సి.ఆర్.శేషయ్య, తహశీల్దార్ హసీనా సుల్తానా, డిఎల్‌పిఒ కార్యాలయపు పరిపాలన అధికారి వీరభద్రప్ప, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ రామేశ్వర రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ రుద్ర గౌడ్ పాల్గొన్నారు.

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తా

- ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

రాబోయే ఎన్నికల్లో టిడిపి మంత్రాలయం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తానని టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దని, మంత్రాలయం ఎమ్మెల్యే టికెట్‌పై టిడిపి అధిష్టానం పునరాలోచన చేస్తుందని తెలిపారు. వారం రోజుల్లో ఎమ్మెల్యే టికెట్‌పై క్లారిటీ వస్తుందని చెప్పారు. పెద్దకడబూరు మండలంలో తన అనుచర వర్గాన్ని పెంచేందుకు కృషి చేస్తానని, 5, 6 రోజుల్లో మరి కొంతమంది టిడిపిలో చేరుతారని తెలిపారు.

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న తిక్కారెడ్డి

టిడిపిలో చేరిన సొసైటీ అధ్యక్షులు హనుమంతురెడ్డి

సొసైటీ అధ్యక్షులు, వైసిపి సీనియర్ నాయకులు బాపురం హనుమంతురెడ్డి ఇంటికి టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి మంగళవారం వెళ్లారు. హనుమంతురెడ్డితో తిక్కారెడ్డి చర్చలు జరిపి టిడిపిలోకి రావాలని కోరారు. సొసైటీ అధ్యక్షులు బాపురం హనుమంతురెడ్డి టిడిపిలో చేరారు. హనుమంతురెడ్డితోపాటు ఆయన తనయుడు వీరసేనారెడ్డి, మనవడు ఇంద్రసేనారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డికి తిక్కారెడ్డి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సొసైటీ అధ్యక్షులు హనుమంతురెడ్డి గతంలో టిడిపిలో సీనియర్ నాయకులుగా పని చేశారని తిక్కారెడ్డి తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, టిడిపి నాయకులు చెన్నబసప్ప డేని, పన్నగ వెంకటేశప్ప స్వామి, అడివప్ప గౌడ్, వెంకటేష్, దశరథ రాముడు, మొట్రు అంజినయ్య, శ్రీనివాసులు, నరసింహులు, మానప్ప పాల్గొన్నారు.

టిడిపిలోకి కప్పట్రాళ్ల బొజ్జమ్మ

ప్రజాశక్తి - దేవనకొండ

వైసిపి జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు పదవికి, వైసిపికి రాజీనామా చేసిన కప్పట్రాళ్ల బొజ్జమ్మ, ఆమె భర్త రామచంద్ర నాయుడు హైదరాబాదులో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపిలో చేరారు. మంగళవారం చంద్రబాబు నాయుడు నివాసంలో అనుచర వర్గంతో కలిసి టిడిపిలో చేరారు. 2019 ఎన్నికల వరకు టిడిపిలో ఉన్న వీరు కోట్ల కుటుంబం టిడిపిలో చేరి టిడిపి ఆలూరు అభ్యర్థిగా కోట్ల సుజాతమ్మకు చంద్రబాబు అవకాశం ఇవ్వడం వల్ల వైసిపికి దగ్గరయ్యారు. కొన్ని నెలల క్రితం జగన్మోహన్ రెడ్డి సమక్షంలో వైసిపి కండువా కప్పుకున్నారు. ఆలూరు ఎమ్మెల్యే సీటు ఆశించారు. జగన్ వీరికి మొండి చేయి చూపి విరుపాక్షికి సీటు ఇచ్చారు. టిడిపి నుంచి టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జ్ కోట్ల సుజాతమ్మకు కూడా చంద్రబాబు సీటు ఇవ్వకుండా 2014లో టిడిపి తరపున పోటీ చేసి స్వల్ప మెజారిటీతో ఓడిపోయిన వీరభద్రగౌడ్‌కు సీటు ఇచ్చారు. కోట్ల ఆలూరు నుంచి వెళ్లిపోవడంతో తిరిగి తమ సొంత పార్టీ టిడిపిలో చేరారు.

చంద్రబాబు సమక్షంలో చేరుతున్న బొజ్జమ్మ దంపతులు

కార్మిక హక్కులను కాలరాస్తే బుద్ధి చెబుదాం

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, పట్టణ సీనియర్ నాయకులు మహానంది రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

కార్మిక హక్కులను కాలరాసే ప్రభుత్వాలకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, పట్టణ సీనియర్ నాయకులు మహానంది రెడ్డి, పట్టణ కార్యదర్శి పిఎస్.గోపాల్, పట్టణ ఉపాధ్యక్షులు డి.లక్ష్మన్న కోరారు. మంగళవారం ఆదోనిలోని సుందరయ్య భవన్‌లో తిప్పన్న అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించి కార్మికులను కార్పొరేట్ శక్తులకు కట్టు బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం మద్దతు తెలుపుతోందని అన్నారు. కార్మికులు, ఉద్యోగులు హక్కుల కోసం చేస్తున్న ఆందోళనలను అణచివేసేందుకు ముందస్తు అరెస్టులు చేయడం, విధుల నుంచి తొలగిస్తామని నోటీసుల ద్వారా భయాందోళనకు గురి చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మే 13న జరిగే పోలింగ్‌లో బిజెపి, టిడిపి, జనసేన, వైసిపిలను ఓడించడానికి ప్రతిన బూనాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఉద్యోగ, కార్మిక, కర్షక ఐక్యత చాటి చెప్పేందుకు మే 1న జరిగే మేడే దినోత్సవ సభకు కార్మికులు, కర్షకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఆటో యూనియన్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు, జి.మనోహర్, నాయకులు రాము, చంద్ర, రంగ, సిడబ్ల్యుసి హమాలీ యూనియన్ అధ్యక్షులు బి.మారెన్న, కార్యదర్శి బి.నాగరాజ్, నాయకులు ఉరుకుంద, రాముడు, ఫర్టిలైజర్ హమాలీ యూనియన్ అధ్యక్షులు రాజు, నాయకులు గోవిందు, డిగారిగేటర్స్ హమాలీ యూనియన్ నాయకులు భీమన్న, హుస్సేనప్ప, ఇటుక పెల్లల అన్‌లోడింగ్ హమాలీ యూనియన్ నాయకులు ఈరన్న, మల్లికార్జున పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మహానంది రెడ్డి

ఘనంగా ధరణీధర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తనయుడు, వైసిపి యువనేత వై.ధరణీధర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, ఆయన సతీమణి జయమ్మ, ధరణీధర్‌రెడ్డి చెల్లెలు ప్రియాంక రెడ్డి, ఇతర కుటుంబ సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేశారు. మంత్రాలయంలోని రాఘవేంద్ర సర్కిల్‌లో వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని చెట్నిహల్లి సర్పంచి అంజినయ్య, ఉప సర్పంచి వీరనాగప్ప ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డికి తినిపించి సంబరాలు చేసుకున్నారు. మండలంలోని తుంగభద్ర గ్రామంలో ధరణీ యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి పలువురు యువకులు రక్తదానం చేశారు. సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న నాయకులు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ఆలూరు : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని విశ్రాంత ఎంఇఒ రామ లింగమ్మ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, బాయ్స్-1, బాయ్స్-2 విద్యార్థులకు 50 మందికి సొంత డబ్బుతో సభ్యత్వం ఇప్పించారు. గ్రంథాలయంలోని పుస్తకాలు, దినపత్రికల విలువలు, ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. పట్టణ గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు విశ్రాంత ఎంఇఒ రామలింగమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

- కలెక్టర్‌కు రైతుసంఘం, సిఐటియు వినతి

ప్రజాశక్తి-ఆలూరు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలను ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా నాయకులు పి.హనుమంతు, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి కోరారు. మంగళవారం వారు బాధిత కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టర్ డాక్టర్ సృజనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. హులేబీడు గ్రామం నుంచి చిప్పగిరి మండలానికి వ్యవసాయ పనుల కోసం కూలీలు వెళ్లారని, తిరిగి వస్తుండగా ఆటో టైరు పగిలి బోల్తా పడిందని తెలిపారు. ఈ ఘటనలో చికిత్స పొందుతూ ముగ్గురు మృతి చెందగా, చాలామంది గాయాలతో ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని చెప్పారు. తాగు, సాగునీటి కోసం ప్రభుత్వాలు, పాలకుల నిర్లక్ష్యంతో వేదవతి, నగరడోన రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టకపోవడం, వర్షాలు కురవక రైతులు, వ్యవసాయ కూలీలు నష్టపోతున్నారని తెలిపారు. ఇతర ప్రాంతాలకు వలసలు, కూలి పనుల నిమిత్తం వెళ్లి ప్రతేడాది కూలీలు మృతి చెందుతున్నారని చెప్పారు. రిజర్వాయర్లను పూర్తి చేసి రైతులను, ప్రజలను కాపాడాలని కోరారు. ఆటో ప్రమాదంలో మృతి చెందిన ప్రతి కుటుంబానికీ రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని, క్షతగాత్రులకు రూ.లక్ష చొప్పున అందించాలని డిమాండ్ చేశారు. వ్యకాస తాలూకా నాయకులు కృష్ణ, రైతు సంఘం మండల కార్యదర్శి యు.ఈరన్న, సర్పంచి భర్త రామాంజిని, బాధిత కుటుంబ సభ్యులు హుస్సేన్ పీరా, మాణిక్, రాజు, వన్నూర్ సాబ్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు విన్నవిస్తున్న నాయకులు, బాధితులు

సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ చేపట్టాలి

- టిడిపి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

వృద్ధాప్య, వికలాంగులు, వితంతు పింఛన్లను లబ్ధిదారులకు ఇబ్బందులు కలుగకుండా సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో పంపిణీ చేయాలని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కలెక్టర్ స్పందించి సచివాలయాల ఉద్యోగుల ద్వారా ఇంటింటికీ వెళ్లి పింఛను పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వాలంటీర్లకు అందజేసిన సెల్ ఫోన్, ట్యాబ్‌లు ఇతర సామగ్రిని వెంటనే స్వాధీనం చేసుకోవాలన్నారు. వాలంటీర్లకు పింఛను పంపిణీ చేస్తే సంబంధిత అధికారులపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రభుత్వ నిధులు రూ.13 వేల కోట్లు మార్చి 16-30 మధ్యలో ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా సొంత కాంట్రాక్టర్లకు జగన్మోహన్ రెడ్డి దోచిపెట్టారని విమర్శించారు. టిడిపి కర్నూలు పార్లమెంట్ కురువ సాధికారిక కమిటీ సభ్యులు కెటి.వెంకటేష్, రామదాసు గౌడు, రామకృష్ణ పాల్గొన్నారు. **కోసిగి** మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ప్రభావతి దేవికి, పంచాయతీ కార్యదర్శి తిరుమలేశ్వర రెడ్డికి వినతిపత్రం అందజేశారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, మాజీ జడ్‌పిటిసి తోవి రామకృష్ణ, టౌన్ ప్రెసిడెంట్ నర్సిరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ జ్ఞానేష్ పాల్గొన్నారు. **ఆస్పరి** ఎంపిడిఒ లక్ష్మి నారాయణకు వినతిపత్రం అందజేశారు. సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణ మాట్లాడారు. టిడిపి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్ర గౌడ్ ఆదేశాల మేరకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. సర్పంచి అంజినయ్య, టిడిపి నాయకులు సుదర్శన్, కృష్ణ, రఘు, సతీష్, మహేష్, వీరేష్, మారేష్, నవీన్, మహేష్, వీరేష్, ఒబులేసు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న బీవీ, నాయకులు

కోసిగిలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆస్పరి ఎంపిడిఒ లక్ష్మి నారాయణకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మాట్లాడుతున్న ఎంపిడిఒ బరేన్ సాహెబ్

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే పింఛన్లు పంపిణీ : ఎంపిడిఒ

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వ సలహాదారులు, ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాల ప్రకారమే పింఛన్లు పంపిణీ చేస్తామని ఎంపిడిఒ బరేన్ సాహెబ్ తెలిపారు. మంగళవారం మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు సచివాలయ అధికారులకు పింఛన్ల పంపిణీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో ఈనెల 4 నుంచి పింఛన్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం పింఛను తీసుకుంటున్న లబ్ధిదారులు ఇంటి దగ్గరికి వెళ్లి అందజేయాలని చెప్పారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ సమయానికి ఏ ఆదేశాలు ఇచ్చినా వాటిని తప్పనిసరిగా ఆచరించేలా ఉండాలని, లేకపోతే ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రతి అధికారి ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించి పింఛన్ల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఇఒఆర్‌డి బాలన్న, ఎపిఒ మాధవ శంకర్ పాల్గొన్నారు.

మారెమ్మ అవ్వ హుండీ చోరీ

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి సమీపంలోని జోహరపురం రోడ్డు పక్కన మారెమ్మ మాన్లు (మారెమ్మ అవ్వ) దగ్గర సోమవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. మంగళవారం ఉదయం ఆలయ పూజారి బజారప్ప పూజ చేసేందుకు ఆలయం దగ్గరికి వెళ్లారు. వేప చెట్టు కింద ఉన్న హుండీని, దేవాలయం తాళాలను, లోపల ఉన్న హుండీని పగులగొట్టి అందులో ఉన్న నగదును దొంగలించారని ఆయన తెలిపారు. వెండితో తయారు చేసిన కోర మీసాలు, కళ్లు, ఇతర ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు చెప్పారు. ఈ విషయంపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న సిఐ హనుమంతప్ప, సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

గుండెపోటుతో వాలంటీరు మృతి

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ మండలం పాలకుర్తి గ్రామంలో వాలంటీరుగా విధులు నిర్వహిస్తున్న బోయ లక్ష్మన్న (35) గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం ఉదయం ఛాతీనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఎమ్మిగనూరు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య సరస్వతి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. లక్ష్మన్న మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - హోళగుంద

ఆలూరు సిఐ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో హోళగుంద ఎస్ఐ జి.పెద్దయ్య నాయుడు, తన సిబ్బందితోపాటు కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం హెబ్బటం గ్రామానికి చెందిన గుబ్బల్ని పెద్ద లక్ష్మన్న 25 బాక్సుల కర్ణాటక మద్యాన్ని గ్రామంలోని కళ్లందొడ్డిలో డంపు చేయగా అతనిని అరెస్టు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు హోళగుంద ఎస్ఐ జి.పెద్దయ్య నాయుడు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.


సమావేశంలో మాట్లాడుతున్న రమాకాంత్‌రెడ్డి

టిడిపి తలుపులు తెరిస్తే వైసిపి ఖాళీ

- తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

టిడిపి తలుపులు తెరిస్తే రాష్ట్రంలోనూ, పెద్దకడబూరు మండలంలోనూ వైసిపి ఖాళీ అవుతుందని తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్‌రెడ్డి, టిడిపి యువనేత రామకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం పెద్దకడబూరులోని నరవ స్వగృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పెద్దకడబూరు సొసైటీ అధ్యక్షులు హనుమంతురెడ్డి, ఆయన తనయుడు వీరసేనారెడ్డి, మనవడు ఇంద్రసేనారెడ్డి టిడిపిలోకి రావడం స్వాగతిస్తున్నామని తెలిపారు. హనుమంతురెడ్డి సొంత గూటికే వచ్చారన్నారు. ఎవరు టిడిపిలోకి వచ్చినా చేర్చుకుంటామన్నారు. రాష్ట్రంలో వైసిపి పని అయిపోయిందని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లో ఉన్నాయని చెప్పారు. టిడిపి మంత్రాలయం ఎమ్మెల్యే టికెట్‌పై నెలకొన్న అనిశ్చితి త్వరలో సర్దుకొంటుందని తెలిపారు. మంత్రాలయం పీఠంపై టిడిపి జెండా ఎగుర వేస్తామని ధీమా వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు కోడిగుడ్ల ఏసేపు, మల్లికార్జున, మీసేవ ఆంజనేయులు, బొగ్గుల నరసన్న, ఆశన్న, క్రాంతికుమార్, లక్ష్మన్న పాల్గొన్నారు.

ఆశాల సేవలు మరువలేనివి

తుగ్గలి : గ్రామీణ ప్రాంతాల్లోని వైద్య, ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఆశా కార్యకర్తలు ప్రజలకు అందిస్తున్న సేవలు మరువరానివని పగిడిరాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ హరిత తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖలో ఆశా వ్యవస్థ వచ్చిన నాటి నుంచి చిన్న జొన్నగిరిలో ఆశా కార్యకర్తగా పని చేసి విరమణ పొందిన షబీరాను పగిడిరాయి వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిత మాట్లాడారు. విరమణ పొందిన షబీరా కరోనా సమయంలో వైద్య సిబ్బందికి ఎంతో సహకారం అందించారని తెలిపారు. అలాగే మాత, శిశు సంరక్షణ కోసం కూడా వైద్య సిబ్బందికి ఆమె అందించిన సహకారం మరువ రానిదన్నారు. సూపర్‌వైజర్ కాంతమ్మ, హెల్త్ అసిస్టెంట్ రమేష్, హెల్త్ సెక్రటరీ పద్మావతి, యుడిసి పరమేష్ పాల్గొన్నారు.

ఉద్యోగులను సన్మానిస్తున్న సిబ్బంది

సువిధ యాప్ ద్వారా 11 దరఖాస్తులకు ఆమోదం

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీ

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎన్నికలకు సంబంధించిన అభ్యర్థులు అనుమతులకు కోసం సువిధ యాప్ ద్వారా చేసుకున్న దరఖాస్తుల్లో 11కి ఆమోదం తెలిపినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.మురళీ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు సువిధ యాప్ ద్వారా వివిధ పార్టీల నుంచి 23 దరఖాస్తులు అనుమతి కోరగా అందులో 11 మాత్రమే అనుమతి ఇచ్చామని తెలిపారు. 5 ప్రోగ్రెస్‌లో ఉన్నాయని, 7 దరఖాస్తులను వివిధ కారణాల వల్ల తిరస్కరించామని చెప్పారు. 18 ఏళ్ల పైబడిన యువత ఓటరు నమోదుకు ఫారం-6 ద్వారా ఈ నెల 15 వరకు అవకాశం ఉందని తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 25 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను, 2 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సమయంలో అత్యంత భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. వికలాంగులకు ప్రత్యేకంగా ట్రై సైకిళ్ల ఏర్పాటు చేయడంతో పాటు 85 ఏళ్ల పైబడిన ఓటర్లకు ఇంటి వద్ద నుంచి ఓట్లు వేసే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. స్థానిక శ్రీపరిమళ విద్యానికేతన్ ఆవరణంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచిన ఎన్నికల సామగ్రిని మే 12న పిఒ, ఎపిఒలకు అప్పగిస్తామన్నారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఎఇఆర్‌ఒలు శ్రీధర్ మూర్తి, మురళీ, ఇడిటి గురురాజారావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

కౌతాళం మండలంలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. కౌతాళం మండలంలోని పోలింగ్ కేంద్రాలు 160, 161, 163 నుంచి మొత్తం 39 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సౌకర్యాల ఏర్పాటుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మురళీ

శ్రీశైలం పాదయాత్రికులకు సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు శ్రీసూర్య నారాయణ స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో వేసవి దాహార్తిని తీర్చే కార్యక్రమంలో భాగంగా మంగళవారం రెండో రోజు నందికొట్కూరు రోడ్డులోని పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల దగ్గర శ్రీశైలానికి కాలినడకన వెళ్లే కర్ణాటక భక్తులకు పులిహోర, మంచినీళ్ల ప్యాకెట్లు పంపిణీ చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. తాగునీటి ప్యాకెట్లు పంపిణీని సాయంత్రం వరకు చేపట్టారు. పులిహోర ప్రసాద దాత చెన్న నాగమహేంద్ర, యామిని దంపతులు సహకరించారు. దేవాలయ కమిటీ సభ్యులు ప్రెసిడెంట్ టిఎస్.రామకృష్ణ, డాక్టర్ నగేష్, శ్రీదేవి, వాలంటీరు రాఘవేంద్ర శర్మ, దేవాలయ సిబ్బంది రామమహేశ్వరప్ప, ధనుంజయ్, నాగరాజు, మహేందర్, మద్దిలేటి, వీరమ్మ, చిన్మయి, మాధవి, ఎల్లమ్మ పాల్గొన్నారు.

పులిహోర వడ్డిస్తున్న దాతలు

ముస్లింలకు ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - మద్దికెర

రంజాన్ పండగ సందర్భంగా ముస్లింలకు మంగళవారం రాత్రి ఎంపిపి డిఎస్.అనిత యాదవ్ ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడారు. మండలంలోని హిందూ, ముస్లింలు కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సోదరభావంతో ముందుకు సాగాలని కోరారు. వైసిపి సీనియర్ నాయకులు డిఎస్.శ్రీనివాసులు, జడ్‌పిటిసి మురళీధర్ రెడ్డి, పంచాయతీ సలహాదారుడు బండారు అంజి, ఎంపిటిసి అంజి, ముస్లింలు పాల్గొన్నారు.

భోజనం వడిస్తున్న నాయకులు

బాధిత కుటుంబాలకు

రూ.25 లక్షల పరిహారమివ్వాలి

- కలెక్టర్‌కు వ్యకాస వినతి

ప్రజాశక్తి - పత్తికొండ

ఇటీవల ఆలూరు మండలం హులేబీడు గ్రామంలోనూ, మద్దికెర గ్రామంలోని వ్యవసాయ పనులకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని, బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం, రెండెకరాల పొలం ఇవ్వాలని వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీర శేఖర్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.రంగారెడ్డి, వ్యకాస మండల అధ్యక్షులు దస్తగిరి, సిఐటియు నాయకులు వెంకటేశ్వర రెడ్డి కోరారు. మంగళవారం కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లాలో కరువు నెలకొని సరైన ఉపాధి లేకపోవడంతో వ్యవసాయ కూలీలు ఉపాధి కోసం వలస వెళ్తుంటారని తెలిపారు. వివిధ మండలాల్లోని కూలీలు పరిసర ప్రాంతాలకు కూలి కోసం నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని చెప్పారు. ఈ నేపథ్యంలో చిప్పగిరి మండలానికి మిరపకాయలు తెంపడానికి ఆలూరు మండలం హులేబీడు గ్రామస్తులు వెళ్లారని తెలిపారు. తిరుగు ప్రయాణంలో హత్తి బెళగల్ దగ్గర వారు ప్రయాణిస్తున్న వాహనం టైర్ పగిలి ముగ్గురు మృతి చెందారని చెప్పారు. తీవ్ర గాయాలతో ఐదుగురు కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో ఐసియులో ఉన్నారని తెలిపారు. వారి పరిస్థితి విషమంగా ఉందన్నారు. వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ సంఘటన జరిగిన మరుసటి రోజు అదే మండలానికి వెళ్లి గ్రామానికి తిరిగి వస్తుండగా మద్దికెరకు చెందిన కూలీలు ప్రయాణిస్తున్న టాటా ఏస్ వాహనం టైరు పగిలి మద్దికెర గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారని తెలిపారు. చాలామందికి గాయాలయ్యాయని చెప్పారు. ఉపాధి కోసం వెళ్లి మృతి చెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీరశేఖర్

సచివాలయాల్లోనే పింఛన్ల పంపిణీ

- కలెక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సచివాలయాల్లోనే సామాజిక భద్రత పింఛన్లను పంపిణీ చేసే ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం పింఛన్ల పంపిణీపై ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 7 గంటల వరకు సచివాలయ సిబ్బంది పింఛను అందజేయాలని తెలిపారు. వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, అస్వస్థతతో ఉన్న వారు, మంచానికే పరిమితమైన వారు, నడవలేక వీల్ చైర్స్‌లో ఉన్నవారు, సైనిక సంక్షేమ పింఛను పొందుతున్న వృద్ధ మహిళలకు ఇంటి వద్దనే పింఛను పంపిణీ చేస్తారని చెప్పారు. పింఛనుదారులందరికీ సచివాలయంలో హైబ్రిడ్ విధానంలో కౌంటర్స్ ఏర్పాటు చేసి పింఛను పంపిణీ చేయాలన్నారు. పంచాయతీ ద్వారా సచివాలయ ప్రాంగణంలో షామియానా, తాగునీరు, కుర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. 3న నగదును డ్రా చేసి సాయంత్రం నుంచి పింఛను పంపిణీని మొదలు పెట్టాలని తెలిపారు. ఈనెల 6లోపు పింఛను పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. సచివాలయాల్లో ఉదయం 6 నుంచి సాయంత్రం 7 గంటల వరకు సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండి పింఛను పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రూ.4 లక్షలు పరిహారం అందజేయాలి

- టిడిపి సీనియర్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

బాధిత రైతులకు ప్రభుత్వం తరపున రూ.4 లక్షల నష్టపరిహారం అందజేయాలని టిడిపి సీనియర్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, టిడిపి కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి కోరారు. మంగళవారం ఐటిడిపి కోడుమూరు అధ్యక్షులు బోయ కృష్ణమ నాయుడు కుమార్తె అనారోగ్యంతో గౌరీ గోపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని బొగ్గుల దస్తగిరి పరామర్శించారు. అనంతరం ఈ.తాండ్రపాడు గ్రామంలో అగ్నిప్రమాదంలో గడ్డివాములు కాలిపోయిన బాధిత రైతులకు టిడిపి కోడుమూరు నియోజకవర్గ సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం తరఫున రూ.4 లక్షల నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

In the court of the II- Additional District Judge Kurnool at Adoni
I.A.No.33/2021 in A.S.No. 117/2007

Between:-
Jalagadugu Jagadeesh Babu (died) by L.rs.
...petitioners/Appellants.
VS
P. Narasimhulu(died) by L.rs
...Respondents.
R-3) P. Deepika D/o P.Narasimhulu, 2/164, Sri Ram Nagar colony, Near Arts and science college, Adoni.

The above named petitioners have filed the above Review petition against the decree and judgment in Appeal A.S.No.117/2007 on the file of this Honorable court against you and the same is posted to 09-04-2024 for your appearance. You are hereby directed to appear in person or through pleader on the aforesaid date at 10-30 A.M., failing which you will be set exparte.

Sd/-G.V.Desai
Advocate for Petitioners/Appellants.

బహిరంగ పత్రికా ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమేమనగా, నా క్లయింట్ అయిన శ్రీ కమ్మరి నరసింహాచారి S/o కమ్మర రామచంద్రప్ప R/o ఇంటి నెం.22/265-ఎ, కార్వాన్ పేట, ఆదోని-518301, కర్నూలు జిల్లా అనువారు ఎల్.పి.నెం.141/1981, యగ్గటి ఈశ్వరప్ప నగర్ నందు పాట్లు నెం.39ను కొనుగోలు చేసియున్నారు. అయితే, సదరు ప్లాటుకు సంబంధించిన రెండు ఒరిజినల్ విక్రయ పత్రములు నెం.1745/2010, తేది:22-03-2010 మరియు నెం.6904/2010, తేది:21-09-2010 అను ఒరిజినల్ డాక్యుమెంట్లు పోగొట్టుకొని వున్నారు. పై తెలిపిన ఒరిజినల్ విక్రయ పత్రములు నా క్లయింటు అయిన శ్రీ కమ్మరి నరసింహాచారి గారి కుమారుడు అయిన కె. ఆనంద కుమార్ గారు జిరాక్స్ నిమిత్తము తీసుకొని వెళు తుండగా ఆదోని పట్టణంలోని షరాఫ్ బజార్ నందు వెళు తుండగా దారిలో క్రిందపడి పోగొట్టుకొనిపోయాయి. వీటి కోసం కె.ఆనంద కుమార్ వెతికినప్పటికి దొరకలేదు, వెంటనే ఆదోని 1వ పట్టణ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా, పోలీసు వారు ఒరిజినల్ విక్రయ పత్రములైన డాక్యుమెంట్ నెం.1745/2010, తేది:22-03-2010 మరియు నెం.6904/2010, తేది:21-09-2010 అనునవి దొరకలేదు అని ధృవీకరణ పత్రము జారీ చేసినారు. అయితే, ఇందుమూలముగా యావన్మంది ప్రజానికానికి తెలియజేయడం ఏమనగా పై తెల్పిన రెండు ఒరిజినల్ విక్రయ పత్రములు ఎవ్వరికైన దొరికినచో 7 పని దినములలో ఈ క్రింది చిరునామాకు సంప్రదించి ఇవ్వగలరని నా క్లయింటు అయిన శ్రీకమ్మరి నరసింహాచారి S/o కమ్మర రామచంద్రప్ప తరపున ఇందుమూలముగా తెలియజేయుచున్నాను.

ఇట్లు
శ్రీ కె. విజయభాస్కర్ రెడ్డి,
న్యాయవాది
O/o Upstairs, AP Revenue Complex, RS Road,
ఆదోని. సెల్ ఫోన్ నెం. 9885764896

ప్రజాశక్తి

బుధవారం 3 ఏప్రిల్ 2024 5

నంద్యాల

ప్రశాంత ఎన్నికలకు పక్కా ఏర్పాట్లు

- పటిష్టంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు
- ఇప్పటి వరకు రూ. 2.80 కోట్లు సీజ్
- 25 మంది వాలంటీర్లు తొలగింపు
- 45 మంది ఉద్యోగులకు షోకాస్ నోటీసులు
- జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి కె.శ్రీనివాసులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి కె.శ్రీనివాసులును కలిసిన ప్రజాశక్తితో జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లు, నిర్వహణపై ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పగడ్బందీగా అమలు చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో పది చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, ఇప్పటి వరకు లిక్కర్, నగదు, ఓటర్లను ప్రలోభాలకు లోను చేసే వివిధరకాల వస్తువుల రూపంలో రూ. 2.80 కోట్లు వరకు సీజ్ చేశామన్నారు. ఇప్పటికే ఈవిఎంలను మార్కెట్ యార్డ్‌లోని గోడౌన్‌ల్లో భద్రపరిచామని తెలిపారు. ఈవీఎంలపై, ఎన్నికల నిర్వహణపై పిఒలకు, ఏపిఓలకు శిక్షణను ఇచ్చామన్నారు.

జిల్లాలో 1,711 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు : జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 1,711 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. ఓటర్లు ప్రశాంతంగా వచ్చి ఓటు వేసి వెళ్లేలా సౌకర్యాలు

మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి కె.శ్రీనివాసులు

అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు.

230 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తింపు : జిల్లాలో 230 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామన్నారు. ఈ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. వెబ్ కాస్ట్ ద్వారా వీడియో చిత్రీకరణ, మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

స్వీప్ పోగ్రామ్ ద్వారా ప్రజల్లో అవగాహన : జిల్లాలో గత ఐదేళ్ల కిందట జరిగిన ఎన్నికల్లో ఓటింగ్ శాతం తక్కువ ఉన్న 60 పోలింగ్ బూత్‌లను, ప్రాంతాలను గుర్తించి ఓటు హక్కు వినియోగించుకునేలా స్వీప్ పోగ్రామ్ ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఎన్నికల విధులకు కేటాయించిన ప్రతి ఉద్యోగి విధులు నిర్వహించాల్సిందే : ఎన్నికల నిర్వహణలో ఎవ్వరికి మినహాయింపు లేదని, విధులకు కేటాయించిన ప్రతి ఉద్యోగి నిర్వహించాల్సిందేనని కలెక్టర్ స్పష్టం చేశారు. కదలలేని వారికి, విధిలేని పరిస్థితిలో ఉన్నవారికి మాత్రమే మినహాయింపు ఉంటుందన్నారు.

సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదులు చేయవచ్చు : ఎన్నికల ప్రవర్తన నియమావళిని రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు, ప్రభుత్వ ఉద్యోగులు ఉల్లంఘిస్తే తక్షణమే సీ విజల్ యాప్‌లో పిర్యాదు చేయవచ్చునని ప్రజలకు సూచించారు. ఇప్పటి వరకు సీ యాప్‌లో 93 ఫిర్యాదులు వచ్చాయని, అందులో 35 మోడల్ కోడ్ ఉల్లంఘించినట్లు వచ్చాయని వాటిని విచారించి తక్షణమే చర్యలు తీసుకున్నామన్నారు. ప్రవర్తనా నియమావళిని పాటించని 25 మంది వాలంటీర్లను, 11 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను విధుల నుండి తప్పించామన్నారు. మరో 45 మంది రెగ్యులర్ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు వెల్లడించారు.

280 అనుమతులు ఇచ్చాం : వాహనాల కోసం, లౌడ్ స్పీకర్ల కోసం తదితర అనుమతుల కోసం 280 దరఖాస్తులకు అనుమతి ఇచ్చామని కలెక్టర్ తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉన్నందువలన పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్‌లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా షెడ్లు ఏర్పాటు, నీటి సౌకర్యం, క్యూ లైన్ వంటివి పక్కాగా అమలు చేయిస్తామని వెల్లడించారు.

కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారు

- కర్నూలు ఎంపీ, నంద్యాల, నందికొట్కూరు, కోడుమూరు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల ప్రకటన

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

త్వరలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తున్న అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. మంగళవారం ఇడుపులపాయలో ఏపిసిసి వైఎస్.షర్మిల అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. కర్నూలు ఎంపీ స్థానానికి, నంద్యాల, నందికొట్కూరు, కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థుల పేర్లు ఖరారు చేశారు. కర్నూలు ఎంపీ స్థానానికి బివి.రాంపుల్లయ్య యాదవ్, నంద్యాల అసెంబ్లీ స్థానానికి గోపవరం గోకుల్ కృష్ణారెడ్డి, నందికొట్కూరు అసెంబ్లీ స్థానానికి తోగురు అర్థర్, కోడుమూరు అసెంబ్లీ స్థానానికి పరిగెల మురళీ కృష్ణ పేర్లను ప్రకటించారు. గోకుల్ కృష్ణారెడ్డి నంద్యాల జడ్పిటిసి సభ్యునిగా ఉన్నారు. ఇటీవల వైసిపి నుంచి కాంగ్రెస్‌లో చేరారు. తోగురు ఆర్థర్ నందికొట్కూరు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇటీవల వైసిపి నుంచి కాంగ్రెస్‌లోకి చేరారు. పరిగెల మురళీ కృష్ణ మాజీ ఎమ్మెల్యేగా పని చేశారు. ఇటీవల వైసిపిని వీడి కాంగ్రెస్‌లోకి చేరారు.

కాంగ్రెస్ ఖాతాలో నంద్యాల : గోకుల్ కృష్ణా రెడ్డి

నంద్యాల అసెంబ్లీ కాంగ్రెస్ ఖాతాలో చేరబోతున్నట్లు కాంగ్రెస్ అభ్యర్థి గోపవరం గోకుల కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం నంద్యాలలోని ఆయన నివాసంలో మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్టానం నంద్యాల అసెంబ్లీ స్థానానికి తన పేరు ఖరారు చేయడం వైఎస్ షర్మిలకు, కాంగ్రెస్ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో నంద్యాల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కైవసం కానుందని, తనకు అశేష ప్రజాబలం తోడుందని, తన గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు.

షర్మిలమ్మకు గిఫ్ట్ ఇస్తా : తోగురు అర్థర్

నందికొట్కూరు అసెంబ్లీ స్థానాన్ని కాగ్రెస్ పార్టీ కైవసం చేసుకుని పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలమ్మకు గిఫ్ట్‌గా ఇస్తామని కాంగ్రెస్ అభ్యర్థి తోగురు అర్థర్ అన్నారు. అసెంబ్లీకి తన పేరు ఖరారు చేసినందుకు అర్థర్ వైఎస్ షర్మిలకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్ఆర్ ఆశయాలను ముందుకు తీసుకుపోయేది షర్మిలమ్మనేనని, రాజన్న పాలన కోసం ప్రతి కాంగ్రెస్ వాది కష్టపడాలని నాయకులకు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు.



కర్నూలు ఎంపీ అభ్యర్థి బివి రాంపుల్లయ్య యాదవ్

కోడుమూరు అసెంబ్లీ అభ్యర్థి పరిగెల మురళీకృష్ణ

నంద్యాల అసెంబ్లీ అభ్యర్థి గోకుల్ కృష్ణా రెడ్డి

నందికొట్కూరు అసెంబ్లీ అభ్యర్థి తోగూరు ఆర్థర్

బిజెపి, దాని మద్దతు పార్టీలను ఓడించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్న శాసనసభ పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని, ఆ పార్టీ మద్దతు ఉన్న టిడిపి, జనసేన పార్టీలను ఓడించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ ప్రజలను కోరారు. సిపిఎం బలపరిచిన అభ్యర్థులను ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. మంగళవారం బండి ఆత్మకూరులో సిపిఎం మండల కమిటీ సమావేశం నాయకులు డేవిడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా టి.రమేష్ కుమార్ మాట్లాడుతూ కులం, మతం పేరుతో పొత్తులు పెట్టుకొని రాజ్యాధికారం పొందాలని ప్రయత్నం చేస్తున్న పార్టీలను ఈ ఎన్నికల్లో ఓడించాలని కోరారు. తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీలు అనైతిక పొత్తు పెట్టుకుని రాష్ట్రంలో అధికారంలోకి రావాలని కులం, మతాలను ఉపయోగిస్తున్నాయని, ఇలాంటి పార్టీలకు రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. లౌకిక వాద పార్టీలను, వామపక్ష పార్టీలు బలపరుస్తున్న ఇండియా కూటమి అభ్యర్థులను ఈ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. రాష్ట్రానికి రైల్వే జోన్, కడప ఉక్కు పరిశ్రమ, రాజధాని, ప్రత్యేక హోదా ఇవ్వని బిజెపితో పొత్తు పెట్టుకున్న టిడిపి, జనసేన పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రత్నమయ్య, సీనియర్ నాయకులు రామచంద్రుడు, డేవిడ్, సుబ్బరాయుడు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎవఓవష్ణు

వెంగల్ రెడ్డి పేటలో వైద్య శిబిరం

- ఇంటింటికి తిరిగి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని వెంగల్ రెడ్డిపేట గ్రామంలో విష జ్వరాలు ప్రబులుతున్నట్లు పత్రికల్లో వచ్చిన కథనాల మేరకు డిఎంహెచ్ఒ డాక్టర్ వెంకటరమణ ఆదేశాల మేరకు మంగళవారం గ్రామంలో వైద్యం శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు, సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ గ్రామంలో 78 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని, వారిలో కొంతమందికి జ్వరం ఉన్నట్లు గుర్తించామన్నారు. జ్వరమున్న వారికి డెంగ్యూ పరీక్షలు రాపిడ్ టెస్ట్ చేయగా నెగిటివ్ వచ్చిందని తెలిపారు. గ్రామంలోని తాగునీటి వనరులను పరిశీలించి నీటి ట్యాంకులను శుభ్రం చేసి, శానిటేషన్, క్లీనింగ్, బ్లీచింగ్ చేయించామని చెప్పారు. ఈ వైద్య శిబిరం ఇంకా రెండు రోజులు గ్రామంలో కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ కాంతారావు, జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు, వైద్యులు కిరణ్ కుమార్, దినేష్, ఎంఎల్ హెచ్‌పి, పంచాయతీ కార్యదర్శి రాంగోపాల్ రెడ్డి, విఆర్ఒ వెంకటేశ్వర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యాధికారులకు పలు సూచనలు ఇస్తున్న డిఎంహెచ్ఒ

ఉగాది ఉత్సవాలకు

నీటి సరఫరా ఏర్పాట్లు పూర్తి : ఇఒ

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలంలో ఈ నెల 6 నుండి 10 వరకు జరిగే ఉగాది మహోత్సవాలలో భక్తుల కోసం నీటి సరఫరా ఏర్పాట్లను పూర్తి చేసినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 6వ తేదీ నుండి 10వ తేదీ వరకు శ్రీశైలం క్షేత్రంలో వైభవంగా మహోత్సవాలు జరగనున్నాయని తెలిపారు. ఈ మహోత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు శ్రీశైల క్షేత్రానికి వస్తారన్నారు. అధిక సంఖ్యలో పాదయాత్రగా వచ్చి శ్రీశైలం క్షేత్రాన్ని సందర్శించనున్నారని చెప్పారు. ఈ సందర్భంగా వీరి కోసం ఇప్పటికే వివిధ ఏర్పాట్లను చేశామన్నారు. ఈ ఏర్పాట్లలో భాగంగా భక్తుల కోసం రోజుకు 1 కోటి 35 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాలలో ఏర్పాటు చేసిన నీటి కుళాయిలను ఉగాది మహోత్సవాలకు కూడా వినియోగించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. సుమారు 450కు పైగా కుళాయిలను క్షేత్ర పరిధిలో ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. క్షేత్ర పరిధిలో రింగ్ రోడ్డు, ఉద్యానవనాలు, ఆరుబయలు ప్రదేశాలలో సుమారు నాలుగు పైగా సింటెక్స్ ట్యాంకులను ఏర్పాటు చేశామన్నారు.

భక్తుల తాగునీటి కోసం ఏర్పాటు చేసిన సింటెక్ ట్యాంకులు

ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున 15 ట్యాంకులను అదనంగా ఏర్పాటు చేశామన్నారు. శాశ్వతంగా 11 ఆర్ సి సి ట్యాంకులను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. క్షేత్ర పరిధిలో 34 ఆరో ప్లాంట్లను భక్తులకు అందుబాటులో ఉంచామన్నారు. సాక్షి గణపతి, హటకేశ్వరం, శిఖరేశ్వరం, కైలాస ద్వారం, పెచ్చెరువుతోపాటు భక్తులు బస చేసే పలు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కైలాస ద్వారం వద్ద నుండి భీమునికొలను వరకు 16 మీటర్ల పొడవున హెచ్‌డిపిసి పైపుల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామన్నారు. కైలాస ద్వారం-భీమునికొలను మార్గమధ్యంలో 1000 లీటర్ల సామర్థ్యం గల 8 సింటెక్స్ ట్యాంకులను తాగునీటి కోసం ఏర్పాటు చేశామన్నారు. కైలాస ద్వారం వద్ద 5000 లీటర్ల సామర్థ్యం గల 8 సెంటెక్స్ ట్యాంక్ లను ఏర్పాటు చేశామన్నారు. అదనంగా 20 వేల లీటర్ల సామర్థ్యం గల ఆర్ సి సి ట్యాంకును ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. వీటన్నింటికీ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే

మీరాపురం మాజీ సర్పంచి మృతి

- నివాళులర్పించిన ఎమ్మెల్యే కాటసాని

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని మీరాపురం గ్రామ మాజీ సర్పంచి యమ్మనూరు జోజమ్మ (80) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గ్రామానికి వెళ్లి జోజమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రాంమోహన్ రెడ్డి, యాగంటి దేవస్థానం చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, యమ్మనూరు మనోహర్ రెడ్డి, బసప్ప, మదర్ సా, జగదీశ్వర్ రెడ్డి, బత్తుల రాంమోహన్ రెడ్డి, సీతారాం రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భూమా అఖిల పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - చాగలమర్రి

స్థానిక న్యూ బిల్డింగ్స్ కాలనీలో నాలుగో ఎంపీటీసీ ఇన్‌ఛార్జి నాగరాజు కార్యాలయ ఆవరణంలో టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్అన్సర్ భాష ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, భూమా అభిమానులు మాజీ మంత్రి భూమా అఖిలప్రియ పుట్టినరోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్అన్సర్ బాష కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ప్రజల మద్దతు ఉందన్నారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి భూమా అఖిలప్రియను అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొలిమి హుస్సేన్ వల్లి, కొలిమి మాబు షరీఫ్, ఆలంసా గారి మౌలాలి, హనీఫ్, మద్దూరు మాబులాల్, కెఆర్‌కె రవి, ముల్లాజిమ్, గఫార్, ఖలీల్ జహీర్ మాపిర్, అజీమ్, ముల్లా షాబుల్, కరిముల్లా, టైలర్ ఖాదర్, జెట్టి సుధాకర్, జెట్టి సురేష్, జట్టి కుమార్, జెట్టి సాయి, వెంకటయ్య, జోసెఫ్ సంజీవరెడ్డి, రాజేష్, ప్రతాప్, కామిశెట్టి రమేష్, కొలిమ అష్రాఫ్, కొలిమి లాజం, నాగూర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేక్ కోసి శుభాకాంక్షలు తెలుపుతున్న టిడిపి నాయకులు

శ్రీశైలానికి కాలినడకన వెళ్లే భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి - పాములపాడు

ఉగాది పర్వదిన సందర్భంగా కర్ణాటక, ఆంధ్ర, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుండి శ్రీశైలానికి కాలినడకన వెళ్తున్న భక్తులకు శ్రీశైల పూసల నిత్యాన్నదాన సేవాసత్రం ఆధ్వర్యంలో మంగళవారం పాములపాడు మండలం ఎర్రగుడూరు గ్రామం సమీపంలో ఉన్న కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో ఉదయం అల్పాహారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం గౌరవాధ్యక్షుడు ఎ.రాజశేఖర్, పూసల నిత్యాన్నదాన కమిటీ అధ్యక్ష కార్యదర్శులు నాయిని రామస్వామి, బత్తిని పెద్దస్వామి, కమిటీ సభ్యులు నాయిని మధుసూదన్ రావ్, తెప్పలి పుల్లాంరాజు, తెప్పలి కుళ్ళాయప్ప, తెప్పలి రాజు, తెప్పలి రామమూర్తి, తెప్పలి వెంకటేశ్వరరావు, తెప్పలి వినయ్, బత్తిన మనోహర్, అకుతోట వెంకటేశ్వర రావు, అకుతోట గోపాల్, అకుతోట ప్రసాద్, అకుతోట శ్రీధర్, పొదిలి భీమేష్, కమిటీ సభ్యులు భారీ స్థాయిలో పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం చేస్తున్న నాయకులు

కాలినడక భక్తులకు మజ్జిగ పంపిణీ

నందికొట్కూరు టౌన్ : కాలినడకన శ్రీశైలం వెళ్ళు భక్తులకు వికలాంగుల హక్కుల పోరాట సంఘం నందికొట్కూరు కమిటీ ఆధ్వర్యంలో రిటైర్డ్ జడ్జి శివరాముడు, రిటైర్డ్ టీచర్ ధర్మారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో మజ్జిగ, చల్లని నీరు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సంఘం అధ్యక్షులు ఎం.నాగన్న, గౌరవాధ్యక్షులు చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, కోశాధికారి శేషమ్మ, సభ్యులు నాగరాజు, సరస్వతి, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం : మాండ్ర

ప్రజాశక్తి - పాములపాడు

రాష్ట్ర అభివృద్ధి టిడిపితోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ నంద్యాల పార్లమెంట్ ఇంచార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్యలు అన్నారు. మంగళవారం పాములపాడు మండలంలోని వేంపెంట గ్రామంలో వారు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాండ్ర శివానంద రెడ్డి మాట్లాడుతూ వైసిపి పాలనలో నందికొట్కూరు నియోజవర్గం ఏ మాత్రం అభివృద్ధి చెందలేదని, టిడిపి హయాంలోనే అభివృద్ధి చెందిందన్నారు. మళ్లీ అభివృద్ధి కావాలంటే టిడిపికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు తిమ్మారెడ్డి, గోవిందు, చంద్రశేఖర్, లక్ష్మి కాంత్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, లింగేష్ గౌడ్, కరీం బాషా, జనసేన పార్టీ నాయకులు రాము, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాండ్ర శివానందరెడ్డి

ప్రజలకు భయపడి బయటకు రాని బుగ్గన

- డోన్ అసెంబ్లీ టిడిపి అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి

ప్రజాశక్తి-డోన్

డోన్ నియోజకవర్గంలో ప్రజలకు ఎలాంటి అభివద్ధి చేయలేదు కాబట్టే మంత్రి బుగ్గన భయపడి బయట తిరగడం లేదని టిడిపి డోన్ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం డోన్ పట్టణంలోని టిడిపి నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి స్వగృహంలో కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. మంత్రి బుగ్గన డోన్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసినట్లు ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. నియోజకవర్గంలోని పల్లెలు, పట్టణాల్లోని కాలనీల్లో తాము తిరుగుతున్నామని, ఎక్కడ కూడా బుగ్గన అభివృద్ధి కనిపించడం లేదన్నారు. మంత్రి బుగ్గన మెయిన్ రోడ్లకు సోకులు చేస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి మేలు చేయలేదు కాబట్టే మంత్రి బుగ్గన ప్రజల్లో ధైర్యంగా తిరగలేక పోతున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రం ఇచ్చిన నిధులతో చేసిన పనులను తానేదో చేసినట్లు చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. డోన్ ప్రజలు ఫ్లోరైడ్ నీటితో చాలా ఇబ్బందులు పడేవారని, కోట్ల సుజాతమ్మ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రూ. 52 కోట్లతో గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి శుద్ధ జలం అందించి శాశ్వతంగా ప్రజల సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. కొండమీద పల్లెలకు రోడ్డు సౌకర్యం లేక గాడిదలపై వచ్చేవారని, కోట్ల విజయభాస్కర్ రెడ్డి సిఎంగా ఉన్న సమయంలో రహదారి సౌకర్యం కల్పించారని చెప్పారు. ఆ తరువాత కేఈ క్రిష్ణమూర్తి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. ఆర్థిక మంత్రి పదవిలో ఉన్న బుగ్గన అవినీతికి పాల్పడడం వల్లనే ప్రజల్లో తిరగలేక భయపడుతున్నారని అన్నారు. ఇక మంత్రి బుగ్గన ఏమి చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, డోన్ నియోజకవర్గంలో టిడిపిని గెలిపించుకుంటేనే న్యాయం జరుగుతుందని ప్రజలే చర్చించుకుంటున్నారని అన్నారు.

మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి

ఫోటో రైట్ అప్:కాల్వలపై బండలను తీయిస్తున్న మున్సిపల్ కమిషనర్ డాక్టర్ యస్.జయరాం

ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలి : కమిషనర్

ప్రజాశక్తి - డోన్

ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని డోన్ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ యస్.జయరాం ప్రజలకు సూచించారు. మంగళవారం డోన్‌లోని పిపిఆర్ నగర్, గాంధీనగర్ సచివాలయాలకు సంబంధించిన 31వ వార్డులో స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ డాక్టర్ యస్.జయరాం శ్రీనివాస్ నగర్, ఆటో నగర్ కాలనీలో పర్యటించారు. కొన్ని కాలనీలలో కాలువలను బండలు వేసి మూసి ఉంచడం గమనించారు. వెంటనే శానిటేషన్ సిబ్బందితో బండలను తొలగించి కాలువలను శుభ్రం చేయించారు. కాలువలను మూసి ఉంచడం వల్ల దోమల సమస్యలు ఎక్కువగా వస్తాయని కాలనీ ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ ఏఈ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా, 1, 16వ సచివాలయం సిబ్బంది, వార్డ్ అడ్మిన్, వార్డ్ ప్లానింగ్ సెక్రటరీ, వార్డ్ అమ్మినిటీ సెక్రటరీ, వార్డ్ శానిటేషన్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిములకు వార్డు మెంబర్ ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ఖాజీవాడ మసీద్, జంగ్లీమా మసీద్‌లలో ముస్లిం సోదరులకు 6వ వార్డు మెంబరు కుమ్మరి సురేష్ బాబు మంగళవారం ఇఫ్తార్ విందును ఇచ్చారు. రంజాన్ సందర్భంగా ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులకు, జమాత్‌లో పాల్గొంటున్న ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఇచ్చారు.

షార్ట్ సర్క్యూట్ మంటల్లో చిక్కుకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పాములపాడు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల చెలరేగిన మంటల్లో చిక్కుకొని పాములపాడు గ్రామానికి చెందిన షేక్ ఫరుక్ బాషా(50) సోమవారం రాత్రి మృతి చెందాడు. పాములపాడు ఎస్సై జి అశోక్ తెలిపిన వివరాల మేరకు.. ఫరుక్ బాషా ధాన్యం కొనుగోలు, అమ్మకాలు వ్యాపారం చేస్తుంటారు. సోమవారం రాత్రి పాములపాడులో తన షాపులో కూర్చొని ఉండగా విద్యుత్ షాక్ సర్క్యూట్ వల్ల వచ్చిన మంటలో చిక్కుకొని మృతి చెందినట్లు ఆయన కుమారుడు అక్బర్ బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మృతి చెందిన ఫరూక్ భాషా (ఫైల్)

కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరితా రెడ్డి

ఆదరించండి.. అభివృద్ధి చేసి చూపిస్తాం

- టిడిపి పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి - గడివేముల

త్వరలో జరిగే ఎన్నికల్లో ప్రజలు టిడిపిని ఆదరిస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని పాణ్యం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరితారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గని గ్రామంలో సూపర్ సిక్స్, బాబు ష్యూరిటి-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని పాణ్యం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరితారెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దత్తత గ్రామాలు అంటూ అభివృద్ధి నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. టిడిపికి అధికారమిస్తే అభివృద్ధి ఏమిటో చూపిస్తామన్నారు. అంతకుముందు స్థానిక టిడిపి యువ నాయకుడు నాయకుడు హర్షవర్ధన్ ఆధ్వర్యంలో గౌరు చరితా రెడ్డికి భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. రానున్న రోజుల్లో టిడిపి విజయానికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని మాజీ ఎంపీపీ, స్థానిక టిడిపి నాయకుడు వంగాల శ్రీనివాసరెడ్డి పార్టీ కేడర్‌ను కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు దేశం సత్యనారాయణ రెడ్డి, వంగాల మురళీధర్ రెడ్డి, పంట రామచంద్రారెడ్డి, దుర్వేసి కృష్ణ యాదవ్, యువజన విద్యార్థి నాయకుడు శ్రీరాములు, బత్తుల సుభద్రమ్మ, ఒడ్డు లక్ష్మీదేవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎస్పి శ్రీనివాసరావు

ప్రశాంత వాతావరణంలో పండగలు జరుపుకోవాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : ప్రశాంతమైన వాతావరణంలో పండగలు జరుపుకోవాలని ఆత్మకూరు డిఎస్పి శ్రీనివాసరావు మత పెద్దలకు సూచించారు. మంగళవారం నందికొట్కూరు పోలీస్ స్టేషన్ నందు ముస్లిం మత పెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు రంజాన్ పండగను అందరూ కలిసి ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐలు ప్రకాష్ బాబు, విజయ భాస్కర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి : గంగుల

ప్రజాశక్తి - చాగలమర్రి : నియోజకవర్గంలో సంక్షేమంతోపాటు చేసిన అభివృద్ధిని చూసి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంగుల బిజేంద్రారెడ్డిని గెలిపించాలని ఆయన సోదరి గంగుల అవంతికారెడ్డి ప్రజలను కోరారు. మంగళవారం మండలంలోని తోడేండ్లపల్లె గ్రామంలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తన సోదరున్ని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందయ్య, ఎంపీపీ రామిశెట్టి వీరభద్రుడు,వైసిపి మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి రమణ, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, వైసిపి నాయకులు సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, శేషు రమేష్, రహమాన్, చాంద్‌బాష, సింగల్ విండో డైరెక్టర్ శ్రీనివాసులు, వెంకటరాముడు, దస్తగిరి, అంకాల్ రెడ్డి, గిరిరాజా, రంగయ్య, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న గంగుల అవంతికారెడ్డి

వైసిపికి భారీ షాక్

- టిడిపిలోకి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని సోదరుడు కాటసాని చంద్రశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సోదరుడు కాటసాని చంద్రశేఖర్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపిలో చేరారు. మంగళవారం హైదరాబాదులో చంద్రబాబు నివాసంలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బిసి జనార్ధన్ రెడ్డికి మద్దతుగా నారా చంద్ర బాబు నాయుడు సమక్షంలో కాటసాని చంద్రశేఖర్ రెడ్డి టిడిపిలో చేరారు. చంద్రబాబు కాటసాని చంద్రశేఖర్ రెడ్డికి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాత్రెడ్డి మల్లికార్జున రెడ్డి, వంగల పరమేశ్వర రెడ్డిలు పాల్గొన్నారు.

చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరిక

కొలిమిగుండ్ల : కొలిమిగుండ్ల మండలంలోని కనకాద్రిపల్లె గ్రామానికి చెందిన విఆర్ రామిరెడ్డి కుమారులు విఆర్ వెంకటేశ్వర్ రెడ్డి, విఆర్ విష్ణువ్ రెడ్డిలు తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నారా నివాసంలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా టీడీపీ గెలుపు కోసం కృషి చేస్తామని విఆర్ వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు.

చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరుతున్న కాటసాని చంద్రశేఖర్ రెడ్డి

టిడిపి నాయకులు వైసిపిలోకి చేరిక

వైసిపి కండవాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో టిడిపి నాయకులు అక్కిరాజు కాలనీకి చెందిన వైసిపి నాయకులు పువ్వాడి భాస్కర్ ఆధ్వర్యంలో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు పట్టణ అధ్యక్షులు సయ్యద్ మీర్, ప్రజాప్రతినిధులు, నాయకులు, జోసెఫ్, రఫిక్, వలి, ఫక్రుద్దీన్, సంపత్, శ్యామ్ పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలు నందికొట్కూరు పట్టణంలోని వైసిపి కార్యాలయంలో సీనియర్ నాయకులు పోచ స్వామి రెడ్డి, జూపాడుబంగ్లా జడ్పీటీసీ పోచ జగదీశ్వర రెడ్డి, పోచ హేమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న చేసిన సంక్షేమం, అభివృద్ధికి ఆకర్షితులై వైసిపిలో చేరినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి వైసిపిలో పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో చల్లా శేఖర్ రెడ్డి, కేశవరెడ్డి భరత్ రెడ్డి, మాజీ సర్పంచ్ విజయకుమార్, మహేష్ నాయుడు, తలారి శివుడు, నాగరత్నం, స్వామి దాసు, జాకీర్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

బుగ్గనను ప్రజలు ఆదరించాలి : అర్జున్ రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో మూడవసారి హ్యాట్రిక్ సాధించేలా ప్రజలు ఆదరించాలని బుగ్గన తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని హనుమాన్ నగర్, సంజీవ్ నగర్ కాలనీలలో ఇంటింటి ప్రచార నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బేతంచెర్ల పట్టణం, గ్రామాలలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పరిపాలన అందించిన జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని మరొక్కసారి ఆదరించాలని కోరారు. గిట్టని వారు కల్లబొల్లని అబద్ధ ప్రచారాలు చేస్తూ అభివృద్ధి జరగలేదని కపట మాటలు మాట్లాడిన వారికి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, సీనియర్ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల డైరెక్టర్ బాబుల్ రెడ్డి, ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ మూర్తి జావలి, కాజా హుస్సేన్, వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మురళీకృష్ణ, నాగరాజు, రామస్వామి, సురేంద్ర నాథ్ రెడ్డి ,చంద్రమోహన్ రెడ్డి, కుంచే తిరుమలేశ్వర్ రెడ్డి, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న బుగ్గన అర్జున్ రెడ్డి

రోజు రోజుకు వైసిపి ఖాళీ : టిడిపి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి రోజు రోజుకు ఖాళీ అవుతుందని, చంద్రబాబునాయుడు విడుదల చేసిన మేనిఫెస్టోకు ఆకర్షితులై వైసిపి నాయకులు టిడిపిలో చేరుతున్నారని నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. మంగళవారం నంద్యాల మండలం సాంబవరం గ్రామానికి చెందిన రాంగోపాల్ రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, శ్రీనివాసులు , మాబు సుభాన్‌తో పాటు బిసి, నూర్ బాషా దూదేకుల సంఘం, ఎస్సీ సంఘాలతోపాటు 80 కుటుంబాలు ఎన్ఎండి ఫరూక్ సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి టిడిపి కండువా కప్పి పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంబవరంలో బలమైన పట్టున జూపల్లి కుటుంబ సభ్యులు వైసిపిని వీడి టిడిపిలో చేరడం సంతోషంగా ఉందన్నారు. ఇక సాంబవరంలో వార్ వన్ సైడ్ అవుతుందన్నారు. సాంబవరంలో తెలుగుదేశం పార్టీకి మెజారిటీ తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఏవిఆర్ ప్రసాద్, తులసి రెడ్డి, గోస్పాడు మండల కన్వీనర్ తులసీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన సాంబవరం వైసిపి నాయకులు, కార్యకర్తలు

నంద్యాలకు ఫరూక్ ఏమి చేశారో చెప్పాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

40 ఏళ్ల అనుభవం, ఎన్నో మంత్రి పదవులు అనుభవించిన ఎన్ఎండి.ఫరూక్ నంద్యాలకు ఏం చేశారో చెప్పాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 23, 17 వార్డులలో నూనెపల్లిలో వార్డు కౌన్సిలర్లు రాజ్యలక్ష్మి, వార్డు ఇంచార్జీ వార్డు ఆధ్వర్యంలో వైసిపి అభ్యర్థి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ప్రచార నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో నంద్యాల చిరకాల కోరిక నంద్యాల జిల్లా అని, ప్రభుత్వ మెడికల్ కళాశాలను తీసుకువచ్చామని, నంద్యాల నీటి కష్టాలను అమృత్ పథకం పూర్తిచేసి పరిష్కారం చేశామన్నారు. నంద్యాలకు మోడల్ స్కూల్, హాస్పిటల్, అర్బన్ హెల్త్ సెంటర్లు, నియోజకవర్గంలోని ప్రతి వార్డులో రోడ్లు, డ్రైన్లు అభివృద్ధి పనులు చేసి చూపించామన్నారు. రానున్న ఎన్నికల్లో తనను మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

17వ వార్డులో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం : నంద్యాల పట్టణంలోని 17వ వార్డులో వార్డు కౌన్సిలర్ లక్ష్మీదేవి, వార్డు ఇంచార్జ్ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, రాష్ట్ర దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పామ్ షావలి, నంద్యాల పట్టణ అధ్యక్షులు జాకీర్ హుస్సేన్ పున్నా శేషయ్య, వైసిపి కౌన్సిలర్స్, వార్డు నాయకులు దేశం సుధాకర్ రెడ్డి, లోకేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే

అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ

ప్రజాశక్తి - శ్రీశైలం : శ్రీశైలం క్షేత్రంలోని భ్రమరాంబ దేవికి మంగళవారం కొబ్బరికాయల సమర్పణ కార్యక్రమాన్ని దేవస్థానం నిర్వహించింది. ప్రతి సంవత్సరం చైత్రమాసంలో పౌర్ణమి తర్వాత వచ్చే మంగళవారం లేదా శుక్రవారం నాడు భ్రమరాంబ దేవికి కుంభోత్సవం నిర్వహించడం సాంప్రదాయంగా వస్తుంది. ఈ సంవత్సరం ఏప్రిల్ 26న కుంభోత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగానే మంగళవారం అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాసిగా పోసి పసుపు కుంకుమలతో పూజలు నిర్వహించారు. ఆ తర్వాత అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పించారు. అలాగే స్వామి అమ్మవార్లకు ఊయల సేవ కార్యక్రమాన్ని, గ్రామ దేవత అంకాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

ప్రజాశక్తి - కొత్తపల్లి : మండలంలోని ఎదురుపాడు, జడ్డువారిపల్లె, కొక్కెరంచ, దుద్యాల, కొత్తమాడుగుల గ్రామాలలో ఎస్ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో బిఎస్ఎఫ్ బలగాలతో మంగళవారం కవాతు నిర్వహించారు. వీధుల వెంట పోలీసులు కవాతు చేస్తూ ఎన్నికల నియమాలను ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాలలో అసాంఘీక కార్యకలపాలు, నాటుసారా, అక్రమమద్యం విక్రయాలు నేరపరిగణలోకి వస్తాయని, అలా చేసినవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాలలో ఎక్కువ మంది గుమ్మికూడదని, ఏమైనా సభలు పెట్టుకోవాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, ఎన్నికల నియమావలికి లోబడి అందరూ నడుచుకోవాలని సూచించారు. ఎన్నికల నియమావలిని ఎవ్వరు పాటించకపోయి,నా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నేటి మధ్యాహ్నం నుండి 6వ తేదీ వరకు సచివాలయాల్లో పెన్షన్ల పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో వున్న నేపథ్యంలో నేటి మధ్యాహ్నం నుండి 6వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధితో మంచానికే పరిమితమైన వారు, అస్వస్థతతో ఉన్న వారు, నడవలేక వీల్ చైర్స్‌లో ఉన్నవారు, సైనిక సంక్షేమ పెన్షన్ పొందుతున్న వృద్ధ మహిళలకు సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దనే పెన్షన్లు పంపిణీ చేస్తారన్నారు. అలాగే ఇతర పెన్షన్ దారులు సమీప సచివాలయాల్లో ఆధార్ కార్డు లేదా గుర్తింపు కార్డు తీసుకెళ్లి పెన్షన్ పొందవచ్చని తెలిపారు. అన్ని సచివాలయాల వద్ద షామియానా, తాగునీటి సౌకర్యం తదితర వసతులు కల్పించామని, పెన్షన్ దారులు ఆతృత పడకుండా పెన్షన్లు తీసుకొని వెళ్లాలన్నారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం ఏడు గంటల వరకు పెన్షన్ పంపిణీ ఉంటుందన్నారు. జిల్లాలో 2,22,935 పెన్షన్‌దారులకు రూ. 66.24 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - బనగానపల్లె

వేసవిలో వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివ శంకరుడు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా గ్రామీణ ప్రాంతాల ప్రజలు బయటకు వెళ్లేటప్పుడు టోపి గానీ, రుమాలు గానీ, గొడుగు గానీ తీసుకొని వెళ్లాలన్నారు. ఎక్కువ నీడ ప్రదేశాల్లో ఉండేలా చూసుకోవాలన్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని తెలిపారు. ఆశాలు గ్రామీణ ప్రాంతాలలో గర్భవతులకు, బాలింతలకు ,చిన్న పిల్లలకు, వృద్ధులకు అనారోగ్య సమస్యలు ఉన్నప్పుడు వారికి తగిన రీతిలో స్పందించి మెరుగైన సేవలు అందించాలన్నారు. వేసవి కాలంలో ఒఆర్ఎస్ ద్రావణం అందుబాటులో ఉంచుకుని ప్రజలకు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సోహెల్ బాబు, ఎంపిహెచ్ఈఓ ఎన్.వెంకటేశ్వర్లు, సూపర్వైజర్ అయ్యమ్మ, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిఎస్‌లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శివ శంకరుడు

వైసిపితోనే మరింత అభివృద్ధి : చైర్మన్

ప్రజలకు కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ చైర్మన్

ప్రజాశక్తి - డోన్

డోన్ ఎమ్మెల్యేగా ప్రజలు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని మూడోసారి గెలిపించుకోవాలని, వైసిపితోనే మరింత అభివృద్ధి జరుగుతుందని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. మంగళవారం డోన్ పట్టణంలోని 32వ వార్డులో ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పట్టణంలో జరిగిన అభివద్ధి కార్యక్రమాలు వివరించారు. మళ్లీ గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని, మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని ఫ్యాను గుర్తుకు ఓటేసి గెలిపించాలని కాలనీవాసులను కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకుడు వెంగల్ రెడ్డి, కౌన్సిలర్లు ఆర్ట్ రమణ, వెంకటరాముడు, సుంకన్న, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు కుమ్మరిరాజు, నంద్యాల జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పోస్ట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి - మిడుతూరు

మిడుతూరు మండలంలోని కనుమూరు గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని బిసి, ముస్లిం మైనార్టీ కాలనీ వాసులు అధికారులను వేడుకుంటున్నారు. గత కొన్ని రోజులుగా ఈ కాలనీలకు నీళ్ల రాకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. ముస్లిం మైనార్టీ కాలనీ వాసులు ప్రస్తుతం రంజాన్ నెల కావడంతో ఉపవాసం ఉంటున్నారని, నీళ్ల రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని టిడిపి నాయకులు ఇదురుస్ బాషా, సుధాకర్ రెడ్డిలు సొంత ట్యాంకర్లతో కాలనీవాసులకు నీటిని సరఫరా చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి మా కాలనీలకు నీళ్ల సరఫరా అయ్యేలా చూడాలని వారు కోరుతున్నారు.

మహారాజశ్రీ నంద్యాల జిల్లా ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్. నెంబర్ 36/2022

పొట్టి మూర్తి చెంచు నారాయణ ... వాది

V/s

చాకలి లింగస్వామి, తండ్రి చాకలి వెంకటస్వామి, వయస్సు 38 సంIIలు ఇంటి నెంబరు 3-91, కురుకుంద గ్రామము, ఆత్మకూరు మండలము, నంద్యాల జిల్లా. ... ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

వాది, ప్రతివాది అయిన మీపై పై దావా వేసి ఉన్నాడు. పై కేసు మీ హాజరు కొరకు 19-4-2024వ తేదీన వాయిదా ఉన్నది. కావున ఆ వాయిదా దినమున ఉదయం10:30 గంIIలకు పై కోర్టులో నీవు ప్రత్యక్షముగా గానీ, వకీలు ద్వారా గానీ నీవు హాజరై పై దావాకు సంబంధించి నీకు ఎటువంటి అభ్యంతరములు ఉన్నను తెలుపుకొన వచ్చును, లేని యెడల పై కేసు విషయమును మీ పరోక్షమున పై కోర్టు వారు తీర్మానించెదరు.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేది : 19-4-2024

జె. సుధాకరరెడ్డి
బి.కాం.,బి.ఎల్.
న్యాయవాది, ఆత్మకూరు,
నంద్యాల జిల్లా.

మహారాజశ్రీ నంద్యాల జిల్లా ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్. నెంబర్ 145/2021

యెచూరి శివ ప్రసాద్ ... వాది

V/s

దూళ్ళ వేణుగోపాల్ Died by LRS

1) దూళ్ళ పద్మ, భర్త లేట్ దూళ్ళ వేణుగోపాల్, వయస్సు 46 సంIIలు

2) దూళ్ళ లోకేష్, తండ్రి లేట్ దూళ్ళ వేణుగోపాల్, వయస్సు 27 సంIIలు

3) దూళ్ళ లక్ష్మీ @ శ్రీలక్ష్మీ తండ్రి లేట్ దూళ్ళ వేణుగోపాల్, వయస్సు 25 సంIIలు R/o. కరివేన గ్రామము, రామాలయం గుడి దగ్గర, కరివేన, ఆత్మకూరు మండలము, నంద్యా జిల్లా ... ప్రతివాదులు

ప్రతివాదికి దావా సమన్లు

వాది, ప్రతివాది అయిన మీపై పై దావా వేసి ఉన్నారు. పై కేసు మీ హాజరు కొరకు 19-4-2024వ తేదీన వాయిదా ఉన్నది. కావున ఆ వాయిదా దినమున ఉదయం 10:30 గంIIలకు పై కోర్టులో మీరు ప్రత్యక్షముగా గానీ, వకీలు ద్వారా గానీ మీరు హాజరై పై దావాకు సంబంధించి మీకు ఎటువంటి అభ్యంతరములు ఉన్నను తెలుపుకొన వచ్చును, లేని యెడల పై కేసు విషయమును మీ పరోక్షమున పై కోర్టు వారు తీర్మానించెదరు.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేది : 19-4-2024

జె. సుధాకరరెడ్డి
బి.కాం.,బి.ఎల్.
న్యాయవాది, ఆత్మకూరు,
నంద్యాల జిల్లా.

టిడిపిపై నిందలు సిగ్గుచేటు

- రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిన సిఎం జగన్
- తక్షణమే ఇండ్ల వద్దకు వెళ్లి పింఛన్లు ఇవ్వాలి : బైరెడ్డి శబరి
- జిల్లా వ్యాప్తంగా ఎంపిడిఒలకు టిడిపి నేతలు వినతులు అందజేత

జెసికి వినతిపత్రం అందజేస్తున్న బైరెడ్డి శబరి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ఖజానాను ఖాళీచేసి పెన్షన్లు ఇవ్వకుండా టిడిపిపై అవాస్తవ ప్రచారం చేయడం సిగ్గుచేటని నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి డా.బైరెడ్డి శబరి అన్నారు. మంగళవారం బైరెడ్డి శబరి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. తక్షణమే పెన్షన్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఆమె జెసిని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో బైరెడ్డి శబరి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఖజానా ఖాళీ అయిందని ప్రజలకు తెలుసని, అందుకే వైసిపి నాయకులు డ్రామాలు ఆడుతున్నారన్నారు. జిల్లా కలెక్టర్, ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించి అర్హులకందరికీ పెన్షన్ తక్షణమే ఇంటివద్ద అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. **నంద్యాల రూరల్ :** వైసిపి ఖజానాను ఖాళీ చేసి పింఛన్లు ఇవ్వలేక జగన్ సర్కారు టిడిపి ఆపిందని దుష్ప్రచారం చేస్తుందని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అన్నారు. పెన్షన్‌దారులకు వెంటనే పింఛన్లు ఇవ్వాలని కోరుతూ మంగళవారం నంద్యాల ఎంపిడిఒకు టిడిపి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. **మిడుతూరు :** ఫించన్లు పంపిణీ చేయించకపోవడానికి నిధుల కొరతే కారణమని, జగన్ సర్కారు చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకోవటానికి టిడిపిపై దుష్ప్రచారం చేయడం తగదని టిడిపి మండల కన్వీనర్ ఖాతా రమేష్ రెడ్డి పేర్కొన్నారు. పింఛన్లు ఇంటి వద్దకే వచ్చి ఇవ్వాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యంలో ఎంపిడిఒకు వినతి పత్రం అందజేశారు. నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, వంగాల శివరామిరెడ్డి, సుధాకర్ రెడ్డి, రంగారెడ్డి, రమణారెడ్డి, కేశాలు, మునాఫ్, చాంద్ బాషా, ఆదినారాయణ, షావలి తదితరులు పాల్గొన్నారు. **మహానంది :** మహానంది మండలంలో పింఛన్లు సత్వరమే పంపిణీ చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డికి టిడిపి శ్రీశైలం నియోజవర్గ సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి అధ్యక్షతన నాయకులు వినతి పత్రం అందజేశారు. మండల అధ్యక్షులు ఉల్లి మధు, జనార్ధన్ రెడ్డి, పాణ్యం ప్రసాదరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. **శ్రీశైలం ప్రాజెక్ట్ :** సుండిపెంట కాలనీలోని తహసీల్దార్ కార్యాలయంలో టిడిపి శ్రీశైలం మండలం ఇంచార్జి వెన్న రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ఎంపిడిఒకు వినతిని అందజేశారు. మండలంలో పింఛన్ పంపిణిలో జాప్యం జరుగకుండా పేదలకు త్వరగా పంపిణి చేయాలని కోరారు. టిడిపి నాయకులు కాతా రామిరెడ్డి, మైలా శ్రీను, రూపస్, రామ సుబ్బారెడ్డి, బిజెపి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జనసేన నాగసాయి పాల్గొన్నారు. **చాగలమర్రి :** పెన్షన్లు ఇంటి వద్దకు వెళ్లి కార్యదర్శులచే పంపిణీ చేయాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్ ఆన్సర్ భాష, మండల కన్వీనర్ నరసింహారెడ్డిలు ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొలిమి మాబు షరీఫ్, ముల్లా అజీమ్, గఫార్, ముల్లా ఆలంశ గారి హనీఫ్, ఖలీల్, ఎన్ఎండి రఫీద్దీన్, షాబా, జట్టి నాగరాజు, కేఆర్‌కే రవి, జెట్టి సుధాకర్, జెట్టి కుమార్, జెట్టి సాయి, కామిశెట్టి రమేష్, టైలర్ ఖాదర్, సల్ల నాగరాజు, గుత్తి నరసింహులు, అబ్దుల్లా, వీరం రెడ్డి భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **పగిడ్యాల :** పింఛన్ లబ్ధిదారులు ఎటువంటి ఇబ్బంది పడకుండా ఇంటింటికి వెళ్లి పింఛన్లను పంపిణీ చేసే విధంగా ఏర్పాటు చేయాలని టిడిపి మండల కన్వీనర్ పలుచాని మహేశ్వర్ రెడ్డి, నాయకుడు వాసు రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కవి రాజుకు టిడిపి ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** పెన్షన్లు ఇంటి వద్దకు వెళ్లి కార్యదర్శులచే పంపిణీ చేయించాలని టిడిపి ప్రచార కార్యదర్శి కోటపాడు శివరామిరెడ్డి స్థానిక ఎంపీడీవో సాయికృష్ణకు వినతి పత్రం అందజేశారు. టిడిపి నాయకులు నాగేశ్వర్ రెడ్డి, టైలర్ రాము, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** పింఛన్ లబ్ధిదారులకు వారి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ టిడిపి మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి, సీనియర్ నాయకుడు, శ్రీశైలం మాజీ ట్రస్ట్ బోర్డ్ డైరెక్టర్ చిట్టంబొట్ల భరద్వాజ శర్మ, తెలుగు యువత నియోజకవర్గం సీనియర్ నాయకులు వెరైటీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీడీవో విజయరావుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు చిన్న లింగారెడ్డి, చెన్నారెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, సర్పంచులు వెలగల రామచంద్రుడు, పెద్దినేని పెద్దన్న, మైనార్టీ నాయకులు జాకీర్ ఖాన్, జాలే నందయ్య, ఇస్మాయిల్, రామకృష్ణారెడ్డి, డిష్ రామలింగం, శివప్రసాద్ పాల్గొన్నారు. **బేతంచెర్ల :** పెన్షన్ దారులకు ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ను అందజేయాలని టిడిపి మండల కన్వీనర్ ఉన్నము ఎల్ల నాగయ్య కోరారు. ఎంపిడిఒకు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ముస్లిం మైనార్టీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ జాకిర్ల బేగ్, నియోజకవర్గ గౌరవ సలహాదారులు కాకర్ల తిరుమలేష్ చౌదరి, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి రవీంద్ర నాయక్, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫయాజ్, జనసేన నాయకులు చల్ల మద్దిలేటి స్వామి, నాగరాజు, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గూటం శివ, నాయని రామకష్ణ, తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** సచివాలయ సిబ్బందితో పింఛన్ దారులందరికి ఇంటింటికి వెళ్లి పెన్షన్లు పంపిణీ చేయాలని నియోజకవర్గ టిడిపి అభ్యర్థి గిత్త జయ సూర్య అన్నారు. ఈవోఆర్‌డికి టిడిపి పట్టణ, మండల నాయకుల ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.

మిడుతూరు : ఎంపిడిఒకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నంద్యాల రూరల్ : ఎంపిడిఒకు వినతి అందజేస్తున్న నాయకులు